## తెలుగు తమ్ముళ్ల సంబరాలు


చంద్రగిరిలో,


కుప్పంలో

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# తెలుగుదేశం క్లీన్ స్వీప్



## చిత్తూరు జిల్లా

### ఒక ఎంపీ, ఆరు ఎమ్మెల్యే స్థానాలు టిడిపి కైవసం
### కుప్పం నుండి చంద్రబాబునాయుడు గెలుపు


టిడిపి ఎంపి అభ్యర్థి ప్రసాదరావు


చంద్రబాబునాయుడు (కుప్పం), అమరనాథరెడి(పలమనేరు), భానుప్రకాష్ (నగరి), గురుజాల జగన్మోహన్‌నాయుడు (చిత్తూరు), మురళిమోహన్ (పూతలపట్టు) థామస్ (జిడినెల్లూరు)

చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:
జిల్లాలో మంగళవారం వెల్లడైన సార్వత్రిక ఎన్నికలు-2024 ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. జిల్లాలోని ఒక ఎంపీ స్థానంతో పాటు, ఏడు ఎమ్మెల్యే స్థానాల్లో ఆరు స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు మంచి మెజార్టీతో విజయం సాధించారు. పుంగనూరు నుండి పోటీ చేసిన ప్రస్తుత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విజయం కోసం ఓట్ల లెక్కింపు కోసం పోరాడుతున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తవుతున్న క్రమంలో నాలుగు ఇవిఎంల్లో సీల్ వేయని విషయం గుర్తించిన తెలుగుదేశం అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి రిటర్నింగ్ ఆఫీసర్‌కు అభ్యంతరం చెప్పడంతో ఓట్ల లెక్కింపు కార్యక్రమం స్తంభించింది. ఈ విషయంపై అధికారులు నిర్ణయం తీసుకోవడంతో జాప్యం జరుగుతుండటంతో ఫలితం వెల్లడిలో ఆలస్యం అవుతుంది. చిత్తూరు నుండి తెలుగుదేశం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన దగ్గుమళ్ళ ప్రసాదరావు రికార్డు స్థాయిలో 2.25 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైకాపా ఎంపీ అభ్యర్థిగా చిత్తూరు నుండి పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ ఎన్.రెడ్డప్ప తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు చేతిలో ఓటమి పాలయ్యారు. ఎంపీ స్థానంకు జరిగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండులో తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు 10 నుండి 15 వేల ఓట్లకు పైగా మెజార్టీ లభించింది. ఎంపీ స్థానంకు కుప్పం అసెంబ్లీ స్థానంతో పాటు మిగిలిన అసెంబ్లీ స్థానాల్లో సైతం భారీ ఓట్ల మెజార్టీ రావడంతో తెలుగుదేశం ఎంపీగా దగ్గుమళ్ళ భారీ మెజార్టీతో విజయంను కైవసం చేసుకొన్నారు. ఇక కుప్పం పోటీ చేసిన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు ఇక్కడ అందరి అంచనాలు పటాపంచాలు చేస్తూ మరోసారి భారీ విజయం నమోదు చేశారు. కుప్పం నుండి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు 48 వేల ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి ఎమ్మెల్సీ భరత్‌ను ఓడించారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి నారా చంద్రబాబునాయుడుకు 1,20,996 ఓట్లు లభిస్తే వైకాపా అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌కు 73 వేల ఓట్లు లభించాయి. పలమనేరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి 20,122 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఇక్కడి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన అమరనాథరెడ్డికి 1,23,232 ఓట్లు లభించగా వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడకు 1,03,110 ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపు కేంద్రంలో 8వ రౌండు ఫలితాల్లోనే ఓటమి తప్పదని భావించిన వెంకటేగౌడ కౌంటింగ్ కేంద్రం నుండి నిష్క్రమించారు. నగరి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన గాలి భానుప్రకాష్ 57 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు.

ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి గాలిభానుప్రకాష్‌కు 1,59,725 ఓట్లు లభించగా, ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన మంత్రి ఆర్‌కె రోజాకు 1,02,493 ఓట్లు లభించాయి. చిత్తూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన గురజాల జగన్మోహన్‌నాయుడు వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డిపై 13 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు 85,734 ఓట్లు సాధించగా వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డికి 72,399 ఓట్లు వచ్చాయి. పూతలపట్టు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మురళీమోహన్ విజయం సాధించారు. ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసి డాక్టర్ సునీల్‌కుమార్ 18 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్‌కు 1,07,572 ఓట్లు లభించగా వైకాపా అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్‌కు 85 వేల ఓట్లు మాత్రమే దక్కాయి. అలాగే జిడినెల్లూరు నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన కృపాలక్ష్మీ తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ థామస్‌పై ఓటమి పాలయ్యారు. తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ థామస్ 25 వేల ఓట్ల మెజార్టీతో వైకాపా అభ్యర్థి కృపాలక్ష్మీపై విజయం సాధించారు.

## తిరుపతి జిల్లా

### ఏడు ఎమ్మెల్యే స్థానాలు తెలుగుదేశం కూటమి కైవసం
### తిరుపతి వైసిపి ఎంపి అభ్యర్థి గురుమూర్తికి అనూహ్య మెజార్టీ


వైసిపి ఎంపి అభ్యర్థి గురుమూర్తి


ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), పులివర్తినాని (చంద్రగిరి), పాశం సునీల్‌కుమార్ (గూడూరు), కురుగొండ్ల రామకృష్ణ (వెంకటగిరి), సుధీర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), కోనేటి ఆదిమూలం ( సత్యవేడు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట)

తిరుపతి, జూన్ 4 ప్రభాతవార్త:
జిల్లాలో మంగళవారం వెల్లడైన సార్వత్రిక ఎన్నికలు-2024 ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. ఏడు ఎమ్మెల్యే స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు మంచి మెజార్టీతో విజయం సాధించారు. తిరుపతి ఎంపిగా వైసిపి అభ్యర్థి గురుమూర్తి గెలుపొందారు. రాష్ట్రంలోనే కొంత ప్రత్యేకత,ప్రాధాన్యత ఉన్న తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా జనసేనపార్టీ బలపరిచిన ఆరణి శ్రీనివాసులు విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డిపై 60,255 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు మొదలైన తొలిరౌండ్ నుండి వైసిపి అభ్యర్థికంటే కొంతమేర ఆధిక్యత సాధిస్తూ వచ్చారు. చివరకు పోస్టల్ బ్యాలట్‌లో కూడా 2వేలు పైచిలుకు ఓట్లు ఆరణికి లభించాయి. తిరుపతిలో ఆయన పోటీచేసి గెలవడంతో జనసేన పార్టీ నేతలు, కూటమిలోని టిడిపి, బిజెపి నేతలు సంబరాలు చేసుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్యేగా 2019లో వైసిపి నుండి పోటీచేసి గెలిచిన ఆయన అక్కడ తాజా ఎన్నికల్లో టిక్కెట్ రాకపోవడంతో వైసిపిని వీడి జనసేనలో చేరారు. వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ 15454 ఓట్లతో విజయం సాధించారు. వైఎస్‌ఆర్‌సిపి అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పై ఆయన విజయం సాధించారు. టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణకు 102716 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి రాంకుమార్ రెడ్డికి 87262 ఓట్లు వచ్చాయి. టిడిపి అభ్యర్థి రామకృష్ణకు 22 రౌండ్లలో మెజారిటీ సాధిస్తూ వచ్చారు. 2009, 2014 సంవత్సరంలో ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. 2019వ సంవత్సరంలో ఆయన ఓటమి చూశారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో మూడో సారి కురుగొండ్ల ఘన విజయం సాధించారు. గూడూరు నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున పాశం సునీల్ కుమార్ పోటీ చేయడం వైఎస్‌ఆర్‌సిపి తరపున మేరుగ మురళీధర్ పోటీ నిలిచారు. అయితే తెలుగుదేశం పార్టీకి పోలైన ఓట్లు 102675 వైసిపికి వచ్చిన ఓట్లు 81483 రావడం జరిగింది అయితే 22469 మెజారిటీతో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా పాశం సునీల్ కుమార్ గెలుపొందారు. పోస్టల్ బ్యాలెట్‌లో రిజెక్ట్ అయిన 372 సునీల్ కుమార్ గతంలో 2014 వైసిపి తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలవడం మరల 2019లో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేయగా 63610 ఓట్లు రావడం 108893 వైసిపికి రావడం జరిగింది చంద్రగిరి ఎంఎల్‌ఏగా టిడిపి అభ్యర్థి పులివర్తి వెంకటమణిప్రసాద్ అలియాస్ పులివర్తి నాని తన సమీప వైసిపి ప్రత్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిపై 43,396 ఓట్ల భారీ మెజార్టీతో అఖండ విజయం సాధించారు. చారిత్రాత్మక చంద్రగిరి రాయలవారి కోటపై టిడిపి జెండాను రెపరెపలాడించిన ఘనత పులివర్తికే దక్కింది. చంద్రగిరి నియోజకవర్గ పాతికేళ్ళ చరిత్రలో పులివర్తి నాని తన విజయంతో చెరగని ముద్రవేశారు. పులివర్తి కుటుంబం 5 ఏళ్ళ సుధీర్ఘ శ్రమకు మంగళవారం ప్రకటించిన ఫలితాలతో ఔరా అనిపించారు. సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయం సాధించారు. నెలవల కుటుంబంలో ఇది వరుసగా మరో విజయం కావడం విశేషం. సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారి ఒక మహిళ ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్యపై విజయం సాధించారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ నెలవల విజయశ్రీ 29,115 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. . సుధీర్‌రెడ్డికి 1,19,554 ఓట్లు రాగా వైకాపా అభ్యర్థి బియ్యపు మధుసూధనరెడ్డికి 77,575 ఓట్లు వచ్చాయి. సత్యవేడు తెలుగుదేశం పార్టీ అభ ్యర్థిగా రెండవ సారి ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం ప్రత్యర్థి పార్టీ వైకాపా అభ్యర్థి నూకతోటి రాజేష్‌పై సుమారు 3739 ఓట్ల తేడాతో విజయం సాధించారు. హోరా హోరీగా సాగిన కౌటింగ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా వున్న కోనేటి ఆదిమూలం గెలుపొందడం విశేషం,

## తెలుగుదేశం ఎంపీగా దగ్గుమళ్ళ ప్రసాదరావు

### - 1.89 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం



చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:
చిత్తూరు ఎంపీగా తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు విజయం సాధించారు. చిత్తూరు ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల నుండి సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. చిత్తూరు ఎంపీ స్థానంకు తెలుగుదేశం అభ్యర్థిగా దగ్గుమళ్ళ ప్రసాదరావు, వైకాపా అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ ఎన్.రెడ్డప్పలు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు వైకాపా సిట్టింగ్ ఎంపీ ఎన్.రెడ్డప్పపై 1.89 లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు అన్ని నియోజకవర్గాల్లో భారీగా మెజార్టీ రావడంతో ఈ మేరకు వైకాపా ఎంపీ అభ్యర్థి ఎన్.రెడ్డప్పపై భారీ విజయం నమోదు చేశారు. తెలుగుదేశం ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసదరావు ప్రతి రౌండులోను భారీ మెజార్టీ సాధించడంతో వైకాపా ఎంపీ అభ్యర్థి ఎన్.రెడ్డప్ప కౌంటింగ్ ప్రారంభమైన కొద్ది సమయానికే కేంద్రం నుండి వెనుతిరిగి వెళ్ళిపోయారు. ఎంపీగా విజయం సాధించిన తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు రిటర్నింగ్ అధికారి సగిలి షన్మోహన్ డిక్లరేషన్ అందజేశారు.

## తిరుపతి ఎంపిగా మళ్ళీ గురుమూర్తి విజయం

### - 14,569 ఓట్ల మెజార్టీతో విజయం

తిరుపతి, జూన్ 4ప్రభాతవార్త:
తిరుపతి పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైసిపికి వ్యతిరేక పవనాలు వీచినా తిరుపతి ఎంపిగా డాక్టర్ మద్దిల గురుమూర్తి రెండవసారి గెలుపొందారు. ప్రజలకు ఈయనపై ఉన్న విశ్వాసం, ఎన్‌డిఎ కూటమిలో వైసిపి నుండి బిజెపిలో వరప్రసాద్‌కు కలసి రాని పార్టీ మార్పు గురుమూర్తికి గెలుపుకు అవకాశంగా కలిసొచ్చింది. 14,569ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు. 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ అప్పట్లో తనకు విశ్వాసపాత్రుడైన ఫిజియోథెరపీ డాక్టర్ మద్దిల గురుమూర్తికి టిక్కెట్ ఇచ్చి పోటీ చేయించారు.అప్పట్లో ఆయన గెలిచారు. పట్టుమని మూడేళ్ళు కూడా ఎంపి పదవిలో పూర్తిచేసుకోలేదు. ఉన్న తక్కువ కాలంలోనే ఆయన పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు చేరువగా ఉంటూ వారి సమస్యలు పట్టించుకుని కొంతవరకు స్పందించారు. ఆయనకు ఇదే కలసిరావడం అదృష్టం. 2024 మేనెలలో జరిగిన ఎన్నికల్లో మళ్ళీ తిరుపతి ఎంపిగా వైసిపి నుండి డాక్టర్ గురుమూర్తి పోటీచేశారు. ఎన్నికల్లో వైసిపి ఎంపి అభ్యర్థి గురుమూర్తికి 6,32,228ఓట్లు రాగా ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి వరప్రసాద్‌కు 6,17659ఓట్లు లభించాయి. పోస్టల్‌బ్యాలట్, ఈవిఎం ఓట్లతో కలిపి 14,569 ఓట్లు ఆధిక్యం లభించింది. తొలిమూడురౌండ్లు బిజెపి అభ్యర్థి లీడ్‌లో కనిపించారు. ఆ తరువాత అన్ని రౌండ్లలో ఎంపి గురుమూర్తిని ఓటర్లు ఆదరించారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని సత్యవేడు, సూళ్ళూరుపేటలో వైసిపికి బలం పుంజుకుంది. ఏడు నియోజకవర్గాల ప్రజలు తనపై చూపిన నమ్మకం, ఆదరణ మరవలేనని గురుమూర్తి తెలిపారు. ఈ విజయం జగనన్న ఆశీస్సులతోనేనని గురుమూర్తి తెలిపారు.

## హ్యాట్రిక్ సాధించిన పెద్దిరెడ్డి

### తగ్గిన మెజార్టీ
### 6095 ఓట్ల తేడాతో గెలుపు



పుంగనూరు, జూన్ 4 ప్రభాతవార్త:
గెలుపు ఓటములు దైవాధీనాలు అనుకుంటాం కానీ, నిన్నటి ఎన్నికల ఫలితాలు మాత్రం ప్రజాదేవాధీనాలు అని నిరూపించాయి. రాష్ట్రంలోనే పేరెన్నిక గల పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ఆద్యంతమూ ఉత్కంఠ రేపాయి. రాష్ట్రంలోని దాదాపు అన్ని నియోజకవర్గాల ఫలితాలు తాడోపేడో తేల్చేయగా, పుంగనూరు అసెంబ్లీ ఫలితాలు మాత్రం 19వ రౌండ్ పూర్తయ్యేవరకు ఊపిర్లు బిగపట్టేలా చేశాయి. వైకాపా అభ్యర్థి పెది ్దరెడ్డి, దేశం అభ్యర్థి చల్లాబాబుల మధ్యన జరిగిన ఎన్నికలలో మంగళవారం ఉదయం ఒకటో రౌండ్‌నుంచే ఉత్కంఠత మొదలైంది. తొలి రౌండ్‌లో చల్లాబాబు పెద్దిరెడ్డిపై 124ఓట్ల ఆధిక ్యంతో పోటీ ప్రారంభించారు. రెండవ రౌండ్‌కు ఆ ఆధిక్యం కాస్తా వేయి ఓట్లు దాటిపోయింది. ఆతరువాత ప్రతి రౌండ్‌కు కేవలం వందల ఓట్ల తేడాతో ఫలితాలు రావడం ప్రారంభించాయి. చివరకు మొత్తం 19 రౌండ్లకు గానూ చల్లా రామచంద్రారెడ్డికి 94,698ఓట్లు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి 1,00,793ఓట్లు లభించాయి. మొత్తానికి 6,095ఓట్ల స్వల్పమెజార్టీతో పెది ్దరెడ్డి విజయం సాధించారు. గత ఎన్నికలతో పోల్చితే ఆయనకు ఈమెజార్టీ చాలా తక్కువ,2019లో దేశం అభ్యర్థిని అనీషారెడ్డిపై ఆయన 43,555ఓట్ల మెజార్టీ సాధించగా, ప్రస్తుతం 6095 ఓట్ల మెజార్టీతో అత్యంత సమీపంలో నుంచి ఓటమి బారిన పడకుండా తప్పుకుని సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

## వారసులకు కలసిరాని ఎన్నికలు

### -తిరుపతి,చంద్రగిరి,జిడినెల్లూరులో పరాజయం


అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, కృపాలక్ష్మి

తిరుపతి, జూన్ 4ప్రభాతవార్త:
తమకంటే తమ పిల్లలను రాజకీయంగా జనంలోకి తీసుకురావాలని ఉవ్విళ్ళూరిన పలువురు జన నేతలు చివరకు రాజకీయంగా నిలదొక్కుకోలేని పరిస్థితి ఎదురైంది. వారసులుగా తమ వారిని ప్రజలకు పరిచయం చేసి, సేవలందించేలా చూడాలని భావించిన వారి ఆశలు అడియాశలుగా మారాయి. ఇదీ ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని తిరుపతి,చంద్రగిరి, జిడినెల్లూరు నియోజకవర్గాల్లో తాజా ఎన్నికల ఓట్ల లెక్కింపుల్లో చవిచూసిన చేదు అనుభవాలుగానే మిగిలిపోనున్నాయి. తిరుపతిలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగిన భూమన కరుణాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిగా, ఆ కుటుంబానికి దగ్గరగా ఉంటూ వచ్చాడు. అదే విశ్వాసంతో కరుణాకర్‌రెడ్డిని చేరదీసిన వైఎస్ తుడ ఛైర్మన్‌గా పదవిని కట్టబెట్టాడు.టిటిడి బోర్డు సభ్యుడుగా అవకాశం కల్పించాడు. ఆ తరువత తిరుపతి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఆయనకంటూ ప్రత్యేకతతో టిటిడి ఛైర్మన్‌గా నియమించారు. 2014లో వైఎస్ జగన్ వైసిపి ఏర్పాటుచేయడంతో ఆయనతో కలసి నడిచారు. ఆపార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో తిరుపతిలో ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2021లో తిరుపతి నగరపాలకసంస్థ ఎన్నికల్లో తన కుమారుడు భూమన అభినయ్‌రెడ్డిని ఏకగ్రీవంగా కార్పొరేటర్ చేయించి, ఏకంగా ఉప మేయర్ పదవిని కట్టబెట్టించాడు. అదే నమ్మకంతో యువకుడైన కుమారుడిని ఎమ్మెల్యేగాచూడాలని భావించారు. ఆయనను ప్రస్తుత ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారుచేయించి పోటీకి నిలబెట్టారు. జనంతో మమేకమై అభివృద్ధిని కాంక్షించేలా పనులు చేశారు.అయితే ఇవేమీ వీరికి కలసిరాలేదు. ఎన్నికల్లో జనసేన అభ్యర్థిచేతిలో ఓడిపోయారు. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనకున్న జనం నమ్మకం, జననేతగా మంచిపేరును కుమారుడికి కూడా తీసుకురావాలని అభిప్రాయపడ్డాడు. ఇప్పటికే కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని తిరుపతి రూరల్ ఎంపిపిగా చేయించి జనంకు సేవచేసేలా చూశారు. ఏకంగా తుడ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఆయనను జనంతో మమేకమయ్యేలా చెవిరెడ్డి కొంత ప్రోత్సహించారు. 2024 ఎన్నికల్లో చంద్రగిరి అభ్యర్థిగా పోటీచేయించడానికి రెండేళ్ళముందుగానే జగన్‌నుండి హామీ తీసుకుని జనంలోకి పంపారు. జనం సమస్యలు తెలుసుకుని వారి బిడ్డగా చూడాలని ఆశపడ్డారు. ఈ ఎన్నికల్లో మోహిత్‌రెడ్డి జనం ఆదరణ చూరగొనలేకపోయారు. ఇక జిడినెల్లూరులో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తన కుటుంబాన్ని రాజకీయంగా చూడాలని భావించి ఈ ఎన్నికల్లో కుమార్తె కృపాలక్ష్మిని ఎమ్మెల్యేగా పోటీచేయించాడు. ఎన్‌డిఎ కూటమి సునామీలో ఆమె ఓటమి చెందారు. అయితే నేతల వారసులు ఓటమితో జననేతలు కుంగుబాటుకు గురయ్యారు. మరీ వీరికి రాజకీయంగా ఎంతవరకు భవిష్యత్తు ఉంటుందనేది జనం చేతుల్లోనే ఉంది.

## గెలుపోటములు సహజం : వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడా

పలమనేరు టౌన్, జూన్ 4 ప్రభాతవార్త:



రాజకీయాలలో గెలుపోటములు సహజమని వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడా తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక వైకాపా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంలో గెలుపోటములు సహజమని వైకాపా నాయకులు, కార్యకర్తలు సమన్వయం పాటించాలని సూచించారు. ప్రజలకు ఎన్నో అభివృద్ధి సంక్షేమాలు వైకాపా ప్రభుత్వంలో చేపట్టామని అయినప్పటికి ప్రజా తీర్పును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఓటమి చెందిన ప్రజలకు తాను, వైకాపా నాయకులు, కార్యకర్తలు అందుబాటులోఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండీ సుధా, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా టీడీపీ విజయోత్సవ సంబరాలు

తవణంపల్లె, జూన్ 4 ప్రభాతవార్త:

పూతలపట్టు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ విజయం సాధించడంతో మండలంలో ఆపార్టీ శ్రేణులు ఘనంగా విజయో త్సవ సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి 14,948 ఓట్లు మెజారిటీతో వైకాపా అభ్యర్థి డాక్టర్ సునీల్‌కకుమార్‌పై గెలుపొందారు. దీనితో ఆపార్టీ శ్రేణులు మండలంలో విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు టీడీపీ, జనసేన, బిజెపీ నాయకులు, కార్యకర్తలు మండలంలోని అరగొండ, తవణంపల్లె, గాజులపల్లె తదితర ప్రాంతాలలో పెద్దఎత్తున బాణా సంచా పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. అలాగే పలు గ్రామాల్లో స్కూటర్ ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా జైచంద్రబాబు, జై పవన్ కళ్యాణ్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

## రాష్ట్రంలో కూటమి హవా..అంబరాన్నంటిన సంబరాలు

గంగవరం, జూన్ 4, ప్రభాతవార్త :

రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పలితాలు మంగళవారం వెలువడ్డాయి. పలితాలు వెలువడిన మొదటి రౌండ్ నుండి ప్రతి రౌండ్‌కు మెజార్టీతో కూట మి హవాకొనసా గింది. రాష్ట్రంలో కూటమి దాదాపు 163 పైగా సీట్లు సాధించడం, పలమనేరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి మాజీ మంత్రి అమర నాథరెడ్డి వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడపై 19200 ఓట్ల మోజార్టీతోగెలుపొంద డంతో గంగవరం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మిఠాయిలు తినిపించుకుంటూ, రంగులుచల్లుకొని, బాణసంచా పేల్చారు. తమ అభిమాన నాయకుడు అమరనాథరెడ్డిని అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలందరికీ టిడిపి, జనసేన, బిజెపి ముఖ్యనాయకులు ప్రత్యేక ధన్యవాదాలుతెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టిబాబు, వినోద్, డ్రైవర్స్ కాలనీ కిరణ్, పవన్, రెడ్డినరేష్, గంగవరం నారాయణ, చిన్నబ్బ, రమేష్, రామాంజులు, యుగంధర్, రామక్రిష్ణ, చరణ్, చంద్ర, నాగేంద్ర, నాగ, యశ్వంత్, సత్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారలోపం...శ్రేణులు కలసిరాకపోవడం

-పుంగనూరులో దేశం ఓటమికి ప్రధాన కారణాలు

పుంగనూరు, జూన్ 4 ప్రభాతవార్త:



రికార్డు సృష్టించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో రాష్ట్రమంతా ప్రభంజనం సృష్టించిన తెలుగుదేశం పార్టీ, పుంగనూరులో మాత్రం హోరాహోరీగా పోరాడినా, ఓటమి చవిచూడక తప్పలేదు. రా ష్ట్రమంతా వైకాపాకు వ్యతిరేఖ పవనాలు వీస్తున్న సమయంలో తెలుగుదేశం అభ్యర్థి చల్లారామచంద్రారెడ్డి పూర్తిస్థాయిలో నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించలేకపోవడంతో పాటూ, ఆయనకు పార్టీశ్రేణులే కలసిరాకపోవడంతో పార్టీ పలు పంచాయతీ గ్రామాలలో ప్రజలను చేరలేకపోయింది. చల్లా రామచంద్రారెడ్డి ఏడాది క్రితమే అభ్యర్థిగా రంగంలోనికి దిగినప్పటికీ, ఆయన వెంట నిజమైన తెలుగుదేశంకు చెందిన పార్టీక్యాడర్ అతి తక్కువ మంది మాత్రమే చేరడంతో పాటూ, కొత్తగా వచ్చి పార్టీని భుజాలమీదుకు ఎత్తుకుని పోరాడి నాయకుల శ్రమ వృధాగా పోయింది. వాస్తవనికి తెలుగుదేశం పార్టీకు కంచుకోటగా ఉండే పుంగనూరులో 2016 ఎన్నికల నాటి నుంచి కూడా దేశం ఓట్ బ్యాంకుగా 60వేలకు పైచిలుకు ఓట్లు స్పష్టంగా ఉన్నాయి. ఈక్రమంలో చల్లా బాబు వెంట పార్టీను బలోపేతం చేయడానికి ముందుకురావాల్సిన తెలుగుదేశం నాయకులు చాలా మంది ముందుకు వచ్చి పార్టీను నడిపించక పోగా, లోపాయికారి ఒప్పందాలు చేసుకుని పార్టీను దెబ్బతీసారు. దీనికితోడు ఎన్నికల ప్రచారంలో బాబు పర్యటనలు మినహా, పార్టీ కేడర్‌కానీ, కార్యకర్తలు గ్రామాలలో ప్రచారాలు నిర్వహించడంలో విఫలమయ్యారు. ఇందుకు నిదర్శనంగా చల్లాబాబుకు పలు రౌండ్లలో పలు టేబుళ్ళవద్ద ఓట్లు చాలా తక్కువ నమోదయ్యాయి. 14వ రౌండ్‌లో ఒక టేబుల్ వద్ద ఆయనకు 43, మరోటేబుల్ వద్ద 9 ఓట్లు నమోదయ్యాయి. తొలి నుంచి పది రౌండ్ల వరకు వైకాపాకు ధీటుగా పోటీనిచ్చినప్పటి నుంచి సదుం మండలం కౌంటింగ్‌లో మెజార్టీ వైకాపాకు ఎక్కువైంది. చివరకు పులిచర్ల, రొంపిచర్ల ప్రాంతాలకు చెందిన రౌండ్లలో చల్లాబాబు కంటే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అధికంగా ఓట్లు నమోదు కావడం ప్రారంభమైంది. ప్రస్ఫుటంగా తేలేదేమిటంటే గ్రామాలలో వెళ్ళి నిలబడి ఓట్లు అడుక్కోకపోవడంతో పాటూ, ఓటుకు నోటు వ్యవహారంలో తక్కువ ఇవ్వడం, చాలా ప్రాంతాలలో అసలే ఇవ్వకపోవడం ,చురుకైన కార్యక్రమాలు లేకపోవడం వంటి సమస్యలు చల్లాబాబు ఓటమికి ప్రధాన కారణాలుగా మిగిలాయి.

## నిర్మానుష్యంగా మారిన సదుం పట్టణం

సదుం, జూన్ 4 ప్రభాతవార్త



సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం కౌంటింగ్ జరిగే నేపథ్యంలో సదుం పోలీసులు పట్టణంలో 144 సెక్షన్ విధించారు. ఇందులో బాగంగా సదుంతో పాటు అన్ని గ్రామాలలో రెండు రోజులుగా పోలీసులు మైకుల ద్వారా ప్రచారం నిర్వహించారు. గుంపులుగా ఉండరాదని, అనవసరంగా గొడవలు సృష్టించరాదని 144 సెక్షన్ అమలులో ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇందుకు గాను మంగళవారం ఉదయం 5 గంటల నుంచే పోలీసులు సదుం పట్టణంలో పహారా ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎవరూ గుమికూడకుండా తగిన జాగ్రత్తలు పాటించారు. దీనితో సదుం పట్టణంలో బంద్ వాతావరణం తలపించింది. గతంలో ఎన్నో సార్లు ఎన్నికలు జరిగినా ఈవిధంగా పోలీసులు పర్యవేక్షించిన సందర్భాలు లేవు. దీనితో అన్ని దుకాణాలు మూతపడ్డాయి. గ్రామంలో ఎవరు తిరగక పోవడంతో రోడ్లు నిర్మానుష్యంగా కనపడ్డాయి. ఇదేంది ఎప్పుడు ఈ విదంగా జరగలేదేఅని ప్రజలు వాపోయారు. సదుం మండలం యర్రాతివారిపల్లెకు చెందిన పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచ ంద్రారెడ్డి, తంబళ్లపలె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డిలు గెలవడంతో ఎన్నికల కౌంటింగ్ సందర్బంగా సదుంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బీజేపీల కూటమి విజయం సాదించడంతో సదుం మండల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ మాడల్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోండి

యర్రావారిపాలెం, జూన్ 4 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఏపీ మాడల్ స్కూల్‌లో 7,8,9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆరోజు పాఠశాలలో జరిగే పరీక్షకు హాజరుకావాలని చెప్పారు.

## నారా భువనేశ్వరీని కలసిన ఎస్కేఆర్

చౌడేపల్లి, జూన్ 4 ప్రభాతవార్త



తేదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరీని పురాతన దేవాలయాల పునర్నిర్మాణదాత, బోయకొండ మాజీ ఛేర్మన్ ఎస్.కే.వెంకట్రమణారెడ్డి కలిశారు. మంగళవారం ఎన్డీయే కూటమి తేదేపా అభ్యర్థులు రాష్ట్రంలో విజయఢంకా మోగించిన సందర్భంగా అమరావతిలోని కరకట్టలో నారావారి నివాసంలో ఆమెను కలిసి ఎస్కేఆర్ శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు.

## చౌడేపల్లిలో విజయోత్సవ సంబరాలు

చౌడేపల్లి, జూన్ 4 ప్రభావార్త



రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అభ్యర్థులు విజయఢంగా మోగించి తేదేపా అధికారం లోకి రానున్న సందర్భంగా చౌడేపల్లి లో తేదేపా నాయకులు సంబరాలు చేసారు. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ (చిట్టి), బిసి నాయకుడు ఆవుల రామచంద్రయ్యల ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి తేదేపా, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు స్థానిక బస్టాండు నందు బాణాసంచాలు పేల్చి తమ అభిమానాన్ని చాటుకొన్నారు.

## టిడిపి కార్యాలయం వద్ద కిక్కిరిసిన టిడిపి శ్రేణులు

పలమనేరు టౌన్, జూన్ 4 ప్రభాతవార్త:

మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఘనవిజయంతో స్థానిక టిడిపి కార్యాలయం కిక్కిరిసింది. భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు కార్యాలయం చేరుకుని అమరనాథరెడ్డికి సుభాకాంక్షలు తెలిపారు. టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి 20122 ఓట్ల మెజారిటీ సాధించారు. ఈ మేరకు పట్టణంలో టిడిపి నాయకులు, కార్యక్తలు సంభరాలు చేసుకున్నారు. సాయంత్రం అమరనాథరెడ్డి పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వేల సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యక్తలు అభిమానులు పార్టీ కార్యాలయానికి చేరుకుని ఆయనకు సుభాకాంక్షలు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బంద్ వాతావరణంలో కుప్పం

కుప్పం, జూన్ 4 ప్రభాతవార్త

నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణం మంగళవారం బంద్ వాతావరణంలో కన్పించింది. ఎన్నికల ఫలితాలు వెల్లడి సందర్భంగా పోలీసుల సూచనల మేరకు పట్టణంలోని దుకాణదారులు ప్రధాన రహదారిలో ఉన్న అన్ని దుకాణాలు మూసేశారు. చివరకు టీకొట్లు, హోటళ్లు కూడా మూతపడ్డాయి. డిఎస్పీ శ్రీనాథ్, అర్బన్ సిఐ రమణ, ఎస్సై సుబ్బారెడ్డిలు పట్టణం, మండల పరిధిలో పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## శాంతిపురంలో దేశం నేతల సంబరాలు

శాంతిపురం, జూన్ 4 ప్రభాతవార్త



మండల కేంద్రమైన శాంతిపురంలో తెదేపా, జనసేన, బిజెపి శ్రేణులు విజయోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక తెదేపా కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చుతూ ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని ఆయన విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, నాగరాజు, నాగభూషణంరెడ్డి, ఉయ్యాలజయరాంరెడ్డి, మణి, గోవిందరాజులు, రమేష్, మురుగన్, కాశీశాస్త్రి, రాజు, కేశవులు, రామకృష్ణ, సింగిరి శ్రీనివాసులు, నాగభూషణం, దాము, గోపాల్, పెద్దన్న, శేఖర్, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, పొలారాణి తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో సైతం దేశం శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి.

## పెట్రోల్‌పోసి సైకిల్‌ను దగ్ధం చేసిన వైకాపా కార్యకర్తలు.. పోలీసులకు ఫిర్యాదు

కుప్పంరూరల్, జూన్ 4 ప్రభాతవార్త

మండలంలోని చెక్కునత్తంగ్రామంలో వైకాపా శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగారు. సైకిల్‌ను బుల్లెట్ వాహనంలో లాక్కెళ్లి కొంతమంది కార్యకర్తలు సైకిల్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన మంగళవారం జరిగింది. ఇది గమనించిన తెదేపా కార్యకర్తలు వైకాపా కార్యకర్తలకు దేహశుద్ధి చేసి కుప్పం పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈసంఘటనపై విచారిస్తున్నారు.

## రామకుప్పంలో తెదేపా నేతల సంబరాలు

రామకుప్పం, జూన్ 4 ప్రభాతవార్త



సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా, జనసేన, బిజెపి కూటమి ఘన విజయం సాధించడంతో రామకుప్పంలో కూటమి నేతలు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కుప్పంలో చంద్రబాబునాయుడుకు అత్యధిక మెజార్టీ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. ప్రజలుఅభివృద్ధి, సంక్షేమాలకుపట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో దేశం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల కౌంటింగ్ ఎఫెక్ట్

-చౌడేపల్లిలో బంద్ వాతావరణం

చౌడేపల్లి, జూన్ 4 ప్రభాతవార్త



సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో బంద్ వాతావరణం నెలకొంనింది. కౌంటింగ్ దృష్ట్యా మండల వ్యాప్తంగా పోలీసులు 144సెక్షన్‌తోపాటు సెక్షన్ 30యాక్ట్ అమలులో వుంటుందనీ, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో దుకాణదారులు, ఇతరత్రా వ్యాపార, ప్రభుత్వ సంస్థలు స్వచ్ఛందంగా మూసేయడంతో బంద్ వాతావరణం ఏర్పడింది. నిత్యం ప్రయాణీకులతో నిండుగా వుంటే బస్టాండు వెలవెల బోయింది. ప్రజలందరూ ఇళ్ళకే పరిమితమయ్యారు. ఎన్నికల ఫలితాలను చూసేందుకు టీవీలకు అతుక్కుపోయారు. రాష్ట్రంలో ఎవరెవరు గెలుస్తారు, మెజార్టీ ఎంత అన్న అంశాలను కుటుంబ సభ్యులతో పంచుకొంటూ రోజంతా ఇళ్ళల్లోనే కాల యాపన చేసారు. మండల వ్యాప్తంగా జనాలు లేక పోవడంతో పలువురు కరోనా రోజులను గుర్తు చేసుకొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కురుగొండ్ల విజయంతో పూజలు నిర్వహించిన టిడిపి నాయకులు

వెంకటగిరి టౌన్, జూన్ 4, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు పోలేరమ్మ గుడి వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని ప్రధాన కూడలిలలో పేల్చి సంబరాలు నిర్వహించారు. పరస్పరం స్వీట్లు తినిపించుకున్నారు.

## నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటాం

కురుగొండ్ల లక్ష్మి సాయి ప్రియ

బాలాయపల్లి, జూన్ 4, ప్రభాతవార్త



తండ్రి కురుగొండ్ల రామకృష్ణను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటామని కుమార్తె కురుగొండ్ల లక్ష్మిసాయి ప్రియ తెలిపారు. తమ కుటుంబం మీద ఉన్న సమ్మకంతో మూడోసారి తండ్రిని గెలిపించారని చెప్పారు. నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తామని చెప్పారు. తండ్రి గెలుపునకు కుమార్తె లక్ష్మి సాయి ప్రియ ఎనలేని కృషి చేశారు. మొదట ఆమెకు తెలుగుదేశం పార్టీ టికెట్‌ను అధిష్టానం ఇచ్చి అనంతరం తండ్రి గెలుపు కోసం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి కృషి చేశారు. రామకృష్ణను మూడోసారి గెలిపించడం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలు తగు గుణపాఠం చెప్పారని చెప్పారు.

## వైసిపికి ప్రజలే తగు గుణపాఠం చెప్పారు

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజాసేవకే జీవితం అంకితం చేస్తా

వెంకటగిరి టౌన్, జూన్ 4, ప్రభాతవార్త



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ప్రజలు తగు గుణపాఠం చెప్పారని ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యేగా గెలు పొందిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడినట్లు తెలిపారు. ప్రజలు తలపై ఉన్న నమ్మకంతో మూడుసార్లు గెలిపిం చినట్లు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంను అభివృద్ధి బాటలో నడిపిస్తానని తెలిపారు. ఆయన వెంట ఆయన కుమార్తె లక్ష్మీ సాయి ప్రియ, రాష్ట్ర టిడిపి కార్యదర్శి జి. నాగేశ్వర రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు మురళి, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

## కోటలో తెలుగుదేశం సంబరాలు

కోట, జూన్ 4 ప్రభాతవార్త

ఎన్‌డిఏ కూటమి అభ్యర్థులు రాష్ట్రంలో విజయకేతనం ఎగురవేయడంతో మంగళవారం కోట మండలం విద్యానగర్‌లో టిడిపి నాయకులు భారీఎత్తున బాణాసంచా కాల్చారు. చంద్రబాబునాయుడు నాయకత్వం వర్ధిల్లాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని ప్రగతిబాటలో తీసుకెళతామని తిరుపతి జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు కృషి చేస్తారని చెప్పారు. ఐదేళ్లుగా ప్రజలు నరకయాతన పడ్డారని ఆరోపించారు. విద్యానగర్‌లో వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చారు. చిట్టేడు, కేశవరం, గూడలి, తిన్నెలపూడి, వెంకన్నపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

## కార్యకర్తల విజయమిది

- వేనాటి సతీష్‌రెడ్డి

సూళ్లూరుపేట, జూన్ 4 ప్రభాతవార్త



సూళ్లూరుపేట నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయదుందుభి మోగించడం సంతోషంగా ఉందని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఐదేళ్ల కష్టానికి తగిన ఫలితం దకినకందని ఆయన చెప్పారు. కార్యకర్తలు వైసీపీ ఆగడాలను, దౌర్జన్యాలను ఎదిరించి నిలిచి ఎన్నో కేసులు పెట్టించుకొని అష్టకష్టాలు పడ్డారని, వారందరి కష్టానికి ఫలితమే ఈ విజయమని ఆయన చెప్పారు. విజయశ్రీ విజయంతో సూల్లూరుపేటలో తెలుగుదేశం పార్టీ తిరిగి నూతనోత్సాహిన్ని తెచ్చిపెట్టినట్లయిందని అన్నారు. విజయం కోసం కృషి చేసిన పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

టిడిపి శ్రేణుల సంబరాలు సూళ్లూరుపేటలో టిడిపి అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయం సాధించడం టిడిపి, జనసేన నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చడంతో పాటు స్వీట్లు పంచిపెట్టి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. పట్టణ కార్యదర్శి ఎజి కిషోర్, జనసేన అధ్యక్షులు పొన్నా కాటయ్య ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు.

## విజయం అందించిన అందరికీ ధన్యవాదాలు

సూళ్లూరుపేట, జూన్ 4 ప్రభాతవార్త



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు భారీ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కూటమిగా ఏర్పడి సర్వశక్తులొడ్డి పోరాడిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే గూడూరులో పాశం సునీల్‌కుమార్, వెంకటగిరిలో కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేటలో నెలవల విజయశ్రీ, సత్యవేడులో కోనేటి ఆదిమూలం విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గాల్లో ప్రతి కార్యకర్త, నాయకులు అవిశ్రాంతంగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేశారని ఆయన చెప్పారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లో తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసి అమలు చేస్తామని గంగాప్రసాద్ తెలిపారు.

## వాడవాడలా టిడిపి శ్రేణుల సంబరాలు

చిట్టమూరు, జూన్ 4 ప్రభాతవార్త



చిట్టమూరు మండలంలోని ఆయా గ్రామాల్లో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. గూడూరు ఎన్‌డిఏ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ 30వేలకు దరిదాపులా విజయం సాధించడంపై మండల ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యల్లసిరి గ్రామంలో బిసి సెల్ అధ్యక్షులు కాపులూరు చెంచురామాచారి, మాజీ సర్పంచ్ పోలిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబరాలు అంబరాన్నంటాయి. అలాగే అరవపాలెం పంచాయతీ పరిధిలోని దరకాస్తు గ్రామంలో టిడిపి శ్రేణులు అభివృద్ధిప్రదాత అయిన పాశం సునీల్‌కుమార్ గెలుపునకు చిహ్నంగా సంబరాలు చేసుకున్నారు. చిట్టమూరులో మండల పార్టీ కన్వీనర్ కిషోర్‌నా యుడు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అలాగే కోగిలి పంచాయతీ పరిధిలో రషీద్‌ఖాన్, కమతం పోలయ్య తదితరుల ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు చేశారు. సోమ సముద్రం, మల్లాం, యాకసిరి, చిల్లమూరు, తాడిమేడు, ఆరూరు, ఈశ్వరవాక, మనెనమాల, ఆలేటి పాడు, మొలకలపూడి తదితర గ్రామాల్లో టిడిపి శ్రేణులు భారీగా సంబరాలు జరుపుకోవడం గమనార్హం.

## కోటలో వర్షం

కోట, జూన్ 4 ప్రభాతవార్త

కోట మండలంలో మంగళవారం వాతావరణం చల్లబడింది. ఎండ నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించాయి. ఒక్కసారిగా వాతావరణం మారిపోవడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి రెండు గంటల పాటు భారీవర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు కొంత ఊరట లభించింది.

## మండలంలో టిడిపి నాయకులు సంబరాలు

వాకాడు, జూన్ 4, ప్రభాతవార్త



ఎన్నికల ఫలితాల్లో టిడిపి దుందుభి అవడంతో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం మండలంలోని అన్ని పంచాయితీ పరిధిలోని గ్రామాలలో టిడిపి పార్టీ నాయకులు బాణాసంచాలతో సంబరాలు జరుపుకొని కమనీయమైన విందును ఆయా ప్రాంతాల ప్రజలకు నాయకులు అందించారు. ఈ సందర్భంగా మండల టిడిపి పార్టీ కన్వీనర్ మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ నూటికి నూరు శాతం తెలుగుదేశం పార్టీ గెలుపొందడం దేశ చరిత్రలోనే ఎక్కడ లేదని ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే టిడిపి గెలుపొందడం చరిత్ర అన్నారు. టిడిపి సీనియర్ నాయకుడు తుమ్మల మోహన్ నాయుడు మండల పరిధిలోని అన్ని చోట్ల టిడిపికి మెజారిటీ రావడం అభినందనీయమన్నారు. మండలంలోని కూటమి నాయకులు అన్ని చోట్ల సునీల్ అన్న గెలుపొందడంతో నాయకులు, కార్యకర్తలు కేకులు కట్ చేసి బాణ సంచాలతో భారీ స్థాయిలో సంబరాలు జరుపుకున్నారు. పలుచోట్ల సునీల్ గెలుపొందడంతో నాయకులు మొక్కులు తీర్చుకుని పొట్టేలు భోజనాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు వేణు నాయుడు, దయాకర్. అన్ని పంచాయితీల నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

## ఇక రాష్ట్రంకు మంచి రోజులు

తెదేపా నేత తీగల సురేష్

కోట, జూన్ 4 ప్రభాతవార్త

ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విస్పష్ట తీర్పుతో వైకాపాకు చుక్కలు చూపించారని తిరుపతి జిల్లా తెదేపా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు చెప్పారు. ఆయన మంగళవారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ ఫలితాల్లో ఆ పార్టీ కనీస స్థాయిలో ప్రభావం చూపలేక సింగిల్ డిజిట్‌కే పరిమితమైందన్నారు. ఇంతటి ఘోర పరాభవానికి కారాణాలు ప్రధానంగా మంత్రులు నేతులు, వాడిన భాష అది వైకాపా పట్ల ప్రజల్లో చులకన భావం కలిగేలా చేసిందన్నారు అధికారంలోకి వచ్చాక విపరీత పోకడలు మొదలయ్యాయన్నారు. రాజకీయ ప్రత్యర్థుల్ని ఆగర్భ శత్రువుల్లా చూడటం జరిగిందన్నారు. అధికారంలో ఉన్న పార్టీ పై ఎన్నో విమర్శలు, ఆరోపణలు రావడం అత్యంత సహజం, చేతనైతే వాటికి హుందాగా సమాధానం చెప్పగలగాలి కానీ బాధ్యత గత పదవుల్లో ఉన్న మంత్రులు సైతం ఆపని చేయలేదన్నారు. ఇది గమనించిన ప్రజలు సరైన తీర్పు ఇచ్చారన్నారు. శాసన సభ్యులు పాశం సునిల్ కుమార్ ఆధ్వర్యంలో కోట మండలంలో ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## టిడిపి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు

చిల్లకూరు, జూన్ 4, ప్రభాతవార్త



చిల్లకూరు మండలం తిక్కవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ విజయం సందర్భంగా కేక్ కట్ చేసి టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు టిడిపి సీనియర్ నాయకులు మందపాటి లింగారెడ్డి, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, సతీష్ రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ ఆవుల ప్రభాకర్, మురళి రెడ్డి, గంగాధర రెడ్డి, టిఎస్ఎన్ఎఫ్ నాయకులు వినయ్ మొగిలిగుంట కార్యకర్తలు గోను వెంకటసుబ్బయ్య, మొగిలిగుంట మస్తానయ్య, గోను చంద్రబాబు, గోను శ్రీనివాసులు, కల్లూరు సుబ్రమణ్యం, కొట్టు కన్నయ్య, మొగిలికుంట సీనయ్య, మొగులగుంట మనోహర్, శ్రీనాథ్, కళ్యాణ్, చరణ్, సంతోష్, సతీష్, గ్రామ కార్యదర్శి కావలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటానికి సిద్ధం

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జూన్ 4, ప్రభాతవార్త



ప్రజా సమస్యల పోరాటానికి ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన కురుగొండ్ల రామకృష్ణకు సహాయ సహకారాలు అందిస్తూ, ప్రజా సమస్యల పోరాటానికి వెనుకడుగు వేయనని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు, నేదురుమల్లి అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. మమ్మల్ని నమ్మి మాతో పాటు ప్రయాణం చేసిన ప్రజలందరికీ ఎప్పటిలాగానే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకత్వం అందుబాటులో ఉండి వారికి అండగా నిలవాలని ఆయన కోరారు. ప్రజల తీర్పును శిరసావహిస్తామని తెలిపారు.

## షిరిడీలో తెదేపా నాయకుల సంబరాలు

.శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త



మహారాష్ట్రలోని షిరిడీలో శ్రీకాళహస్తి తెలుగుదేశంపార్టీ నాయకులు షిరిడీ సాయినాథున్ని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయం వద్ద శ్రీకాళహస్తి తెలుగుదేశంపార్టీ మాజీ యువత నాయకుడు దయాకర్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి అక్కడ ఉన్న భక్తులకు పంపిణీచేశారు. ఈసందర్భంగా దయాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందిందని ఇకపై రాష్ట్రంలోను సంక్షేమ పాలన రావడంతోను, శ్రీకాళహస్తిలో సుధీర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో ఎంఎల్‌ఏగా గెలుపొందడం ఎంతో సంతోషమన్నారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## సంబరాల్లో కూటమి యువత నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త



బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవడంతో పట్టణంలో యువత సంబరాలు చేసుకున్నారు. కొందరు యువత పెండ్లిమండపం, బేరివారి మండపం, బిక్షాలగాలిగోపురం వద్ద బాణాసంచాపేల్చి సంబరాలు చేసుకోవడంతో పాటు యువకులు స్వీట్లు పంపిణీచేసుకుని సంబరాలు చేసుకున్నారు.

## కన్నులపండువగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

.శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త

శ్రీకాలహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయ క్షేత్రపాలకుడు కాలభైరవస్వామి ప్రాకారోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలో వెలసిన కాలభైరవస్వామి ఉత్సవమూర్తిని విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా క్షేత్రపాలకుడు కాలభైరవస్వామికి పూజలు అభిషేకాలు నిర్వహించి నిమ్మకాయలతో విశేష అలంకరణ చేపట్టారు. ఉత్సవానికి పలువురు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయంలో వెండినంది ప్రదోష సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతోనిర్వహించారు. పలువురు భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

## ఆర్టీసి రాష్ట్ర వైస్‌చైర్మన్ రాజీనామా

శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త

ఏపిఎస్‌ఆర్టీసి రాష్ట్ర వైస్ ఛైర్మన్ మిద్దెలహరి రాజీనామా చేశారు. ఈసందర్భంగారాజీనామా పత్రాన్ని ఆర్టీసి ఎండికి పంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల ఫలితాల ప్రజాతీర్పును గౌరవిస్తూ తాను తన పదవికి రాజీమానా చేస్తున్నట్లు వివరించారు. తన పదవీకాలంలో సహాయసహకారాలు అందించిన నాయకులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## హ్యాట్రిక్ సాధించిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జూన్ 4, ప్రభాతవార్త



టిడిపి నేత కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి శాసన సభ్యునిగా 2009లో నేదురుమల్లి రాజ్యలక్ష్మి పై విజయం సాధించగా, 2014లో కొమ్మి లక్ష్మి నాయుడుపై విజయం సాధించగా, 2019లో ఆనం రామనారాయణ రెడ్డి పై అపజయం చవిచూశారు. నాటి నుంచి ప్రతిపక్ష టిడిపి నాయకునిగా ఉన్నారు. 2024లో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిపై వెంకటగిరి టిడిపి అభ్యర్థి రామకృష్ణ 15454 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించారు. వెంకటగిరి నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తనదైన శైలిలో టిడిపి పార్టీలో జిల్లా రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. ఇంటింటికి, గ్రామాలకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుమార్తె కురుగొండ్ల లక్ష్మి సాయి ప్రియ సైతం తన తండ్రి రామకృష్ణ గెలుపుకోసం నిర్విరామంగా పనిచేసి ఫలితం సాధించారు. 2019లో ఆనం రామనారాయణ రెడ్డి పై అపజయం పాలవడంతో, నేడు గెలుపుకోసం అహర్నిశలు కష్టపడి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పై విజయం సాధించి వెంకటగిరి గడ్డపై తెలుగుదేశం జెండాను రెపరెపలాడించారు. కురుగొండ్ల రామకృష్ణ హ్యాట్రిక్ విజయం సాధించడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు, నాయకుల్లో నూతన ఉత్తేజం నెలకొంది. రామకృష్ణ వెంకటగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించటంతో టిడిపి పార్టీ కార్యాలయం వద్ద టిడిపి నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

## గ్రూపుల పోరులో కిలివేటి ఓటమి

తడ, జూన్ 4 ప్రభాతవార్త

అధికార వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య ఈ ఎన్నికల్లో పరాజయం పొందారు. వరుసగా రెండుసార్లు గెలిచిన ఆయన హ్యాట్రిక్ సాధించాలని ఈ సారి కూడా పోరాడినప్పటికీ ఫలితం దక్కలేదు. మాజీమంత్రి పసల పెంచలయ్య అల్లుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన ఒకప్పటి గృహనిర్మాణ శాఖ ఉన్నత ఉద్యోగి సంజీవయ్య 2014, 2019లలో వైసీపీ తరపున గెలుపొందారు. పార్టీ అధిష్టానానికి విధేయుడిగా ఉంటూ 2019లో రాష్ట్రంలోనే మూడవ అతిపెద్ద మెజార్టీ సాధించిన సంజీవయ్య టికెట్ సాధనలో పైచేయి సాధించారు. సొంత పార్టీలోనే అసమ్మతి నాయకులు పదేపదే బహిరంగ సమావేశాలు పెట్టి అభ్యర్థిని మార్చాలని అధిష్టానానికి ఫిర్యాదులు చేసినప్పటికీ కిలివేటిపై నమ్మకంతో వైఎస్ జగన్ టికెట్‌ను ఇప్పించారు. అయితే అప్పటి నుంచే విజయం కోసం కష్టపడాల్సి వచ్చింది. సొంత పార్టీలో అసమ్మతులు సంజీవయ్య పరిష్కరించుకోలేకపోయారు. చివరికి ఆ ప్రభావం పోలింగ్ రోజున స్పష్టంగా కనిపించింది. క్రాస్ ఓట్లు ఎక్కువ బూత్‌లలో పడ్డాయి. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఓట్ల లెకినకంపు పూర్తయిన తర్వాత ఈవీఎంలు అసమ్మతి నేతల గుట్టురట్టు చేసినట్లయింది. అనేక గ్రామాల్లో సంజీవయ్యను వ్యతిరేకించిన నాయకులు మాత్రమే కాకుండా సొంత మనుషులుగా ఆయనను అంటిపెట్టుకున్న వారి సొంత గ్రామాలు, వార్డులలో కూడా ఓట్లు తగ్గడం విశేషం. ఈ పరిణామాలతో వైసీపీ నాయకులు పోస్టుమార్టం మొదలుపెట్టారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం మొత్తంలో విజయోత్సవాలు జరుపుకుంటోంది.

## ఓట్ల లెక్కింపులో ఉద్రిక్తత

– చిత్తూరులో దుకాణాలు ధ్వంసం

చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:




చిత్తూరు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలో మంగళవారం చేపట్టిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పురస్కరించుకుని చిత్తూరు నగరంలో ఉద్రిక్తత నెలకొంది. కొంతమంది వ్యక్తులు ఊరేగింపుగా వెళ్ళి పలు చోట్ల కార్యాలయాలు, దుకాణాలు ధ్వంసం చేశారు. ఉడిపి హోటల్ సమీపంలోని భూగర్భ గనుల శాఖ కార్యాలయ భవనంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అలాగే వైకాపాలో ఇప్పటి వరకు కీలకంగా వ్యవహరించిన మైనార్టీ నాయకులు అన్ను, ప్రసన్నకుమార్‌లకు చెందిన పలు దుకాణాలను ధ్వంసం చేశారు. కట్టమంచి ప్రాంతంలో రెండు షాపులు ధ్వంసం కాగా, ప్రేమళ థియేటర్‌కు సమీపంలో ఒక బేకరి, ఒక చికెన్ షాపును ధ్వంసం చేశారు.

## జై శ్రీరామ్...జైశ్రీరామ్



తిరుమల, జూన్ 4ప్రభాతవార్తప్రతినిధి: అంజనాద్రిలోని బాలాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రీతిపాత్రమైన చామంతి పుష్పాలతో విశేష సహస్రనామార్చన నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించారు.

## కౌంటింగ్ మధ్యలో వెనుదిరిగిన వైకాపా అభ్యర్థి వెంకటేగౌడా

పలమనేరు, జూన్ 4, ప్రభాతవార్త:

చిత్తూరులోని ఎస్వీసెట్ కళాశాలలో జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మధ్యలోనే పలమనేరు వైకాపా అభ్యర్థి వెంకటేగౌడా వెనుదిరిగారు. 21 రౌండ్లలో పలమనేరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉండగా వైకాపా అభ్యర్థి మధ్యాహ్నం సుమారు 7 రౌండ్లు ముగియకముందే కౌంటింగ్ హాల్ నుండి వెనుదిరిగి పలమనేరు చేరుకున్నారు. మొదటి రౌండ్ నుండి ఆయనకు సానుకూలంగా ఓట్లు రాకపోవడంతో వెంకటేగౌడా నిరాశ చెంది కౌంటింగ్ హాల్ నుండి వెనుదిరిగినట్లు తెలుస్తుంది.

## పలమనేరులో టిడిపి నాయకుల సంబరాలు

–ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన నాయకులు

పలమనేరు టౌన్, జూన్ 4, ప్రభాతవార్త:

పలమనేరులో అమరనాథరెడ్డి ఘనవిజయం సాధించడంలో స్థానిక టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక మార్కెట్ కమిటీ వద్ద అధిక సంఖ్యలో టిడిపి నాయకులు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో ర్యాలీలు నిర్వహించరాదని సిఐ చంద్రశేఖర్, సిబ్బంది వారిని అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రోడ్లపై సంబరాలు చేసుకున్నారు. దీంతో పోలీసులకు టిడిపి నాయకులకు స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. కొంతమంది టిడిపి అభిమానులు ఫ్యాన్‌ను ద్విచక్రవాహనాకి కట్టి రోడ్లపై ప్రయాణిస్తు రోడ్లపై ఫ్యాన్‌ను వేసి ముక్కలు చేశారు.

## శివయ్య సేవకు పెరుగుతున్న భక్తులు: 20వేల మంది దర్శనం

అభిషేకాలకు పెరుగుతున్న ఆదరణ

శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త



శివయ్య సేవకు భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఓ వైపు ఎండలు, మరో వైపు ఎన్నికల ఫలితాలు వెల్లడి అవుతున్నా భక్తులు లెక్క చేయక స్వామి అమ్మవార్ల దర్శనాలకు వచ్చారు. మంగళవారం అయినా ఆలయాలు కిట కిట లాడాయి. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. మంగళవారం ఆలయం భక్తులతో కిట కిట లాడింది. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు. ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సోమవారం 25వేల మంది దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు రద్దీగా కనబడ్డారు. ముఖ్యంగా ఆలయంలో నిర్వహించే అభిషేకాలకు రద్దీ చోటు చేసుకుంది. ప్రత్యేకదర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 1428 మంది కాగా రాహుకేతుదోష నివారణ పూజలు నాలుగు వేల మంది జరిపించుకున్నారు. అభిషేకాలకు రద్దీ ఏర్పడింది. 60 మంది అభిషేకాలు జరిపించుకోగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 17 జరిగాయి. అర్చనలు 88, గోపూజలకు 12 మంది దీపారాధన 37 హోమాలు 6 జరిగినట్లు అధికారులు వివరించారు. ఓ వైపు అక్షరాభ్యాస కార్యక్రమాలు మరో వైపు భక్తుల రద్దీతో ఆలయం కిట కిట లాడింది.

**రాహుకేతు పూజలకు నిరీక్షణ:**

మంగళవారం మధ్యాహ్నం నుంచి రాహుకాల సమయంలో ఎండలను సైతం లెక్క చేయక రాహుకాల సమయంలో పూజలు చేయించుకోవటానికి వచ్చిన భక్తులు ఎండలను లెక్క చేయలేదు. పూజలకు హాజరయ్యారు. ఆది, సోమవారాల్లో రోజూ 25వేల మంది భక్తులు తగ్గటం లేదు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. మిగిలిన రోజుల్లో కనీసం 20వేలు తగ్గటం లేదు. దాంతో ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.

## మండలాల్లో దేశం సంబరాలు:ఊరందూరులో ఆనందోత్సాహాలు

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయ బావుటా ఎగుర వేయటంతో శ్రీకాళహస్తి, ముస్సి పాలిటి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో సంబరాలు మిన్ను ముట్టాయి. ఐదేళ్ళ పాటు వివిధ పోలీసు కేసులతో సతమతమైన, అక్రమ కేసులతో తల్లడిల్లిన దేశం శ్రేణులు ఈ సారి ఎన్నికలను ఆషామాషిగా చూడలేదు. ఎలాగైనా గెలుపే లక్ష్యంగా పని చేసారు. మంగళవారం ఉదయం నుంచి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగ్రామం అయిన ఊరందూరులో ఉత్కంఠత చోటు చేసుకుంది. అయితే పది రౌండ్లలలో మెజారిటి 19వేలు దాటటంతో కార్యకర్తల్లో జోష్ పెరిగింది, బొజ్జల సుధీర్‌రెడ్డి కౌంటింగ్‌కేంద్రానికి వెళ్ళగా ఇంటి వద్ద బొజ్జల బృందమ్మ, బొజ్జల రిషితారెడ్డి ఉంటూ కార్యకర్తలతో మమేకమయ్యారు. మధ్యాహ్నానికి విజయం ధీమా వచ్చింది. దాంతో గ్రామంలో సంబరాలు చోటు చేసుకున్నాయి. ఇక మాజీ రాచగున్నేరి సర్పంచ్ సారధ్యంలో శ్రీకాళహస్తి మండలంలో సంబరాలు ఏర్పాటు చేసారు. నిరుపేదలకు అన్నదానం జరిపారు. తెలుగుదేశం విజయం చారిత్రాత్మకం అని వివరించారు. ఇక శ్రీకాళహస్తి మండలంలోని బివి పురంలో పార్టీ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కాగా శ్రీకాళహస్తి మండలంలోని నాయకులు తాటిపర్తి ఈశ్వరరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి వారి సహచరులు విజయోత్సవాలను ఎంపేడు గ్రామంలో నిర్వహించారు. ఊరందూరు గ్రామంలో బృందమ్మతో కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్‌సివి నాయుడు నివాసంలో సత్యవేడు దేశం సంబరాలు

శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త



తిరుపతిజిల్లాలోని చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళూరుపేట, వెంకటగిరి నియోజవర్గాల్లో విజయం సాధించిన అభ్యర్థులను మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు సత్కరించారు. మంగళవారం రాత్రి ఎస్‌సివి నాయుడు ఇంటి వద్ద సత్యవేడు నియోజకవర్గ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బియ్యపు మధుసూధనరెడ్డి అరాచకాలు, పెచ్చుపెరిగిపోయాయన్నారు. ఎక్కడ సెంటు భూమి కనబడినా ఆక్రమించుకోవటం అనుయాయుల దౌర్జన్యాలు పెచ్చుపెరిగిపోయాయన్నారు. ఈ నియోజకవర్గ నాయకుడుగా తనకు 38వేల ఓట్లు వచ్చాయని తనకు తిరుగులేదని అవసరం అయితే నారాలోకేష్, నారాచంద్రబాబునాయుడుతో అయినా పోటీకి సవాల్ అన్నారు. అయితే నియోజకవర్గంలో ఐదేళ్ళ పాటు మధుసూధనరెడ్డి పరిపాలనను అరాచకాలు దేవాలయం వ్యవస్థను భ్రష్టుపట్టించటం, భూదందాలను ప్రజలు గమనించారన్నారు. ఇక ఎన్నికల సమయంలో మంచినీళ్ళ ప్రాయంగా డబ్బులు చల్లినా జనం తీసుకున్నారని కానీ వారు ఎవరికి ఓటు వేయాలనుకున్నారో వారికే వేసారని వివరించారు. ప్రజలు ఎగిరి ఎగిరి పడ్డ వైసిపి నాయకునికి కర్రకాల్చి వాత పెట్టినట్లు ఓటుతో బుద్ది చెప్పారని ఇక జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ళు ఒక్క సారి అయినా మీడియా ముందుకు రాకుండా ఓడిపోగా మొసలి కన్నీరు కార్చారని తాను ఎంతో చేసానని చెప్పటం గమనిస్తే రాష్ట్రాన్ని ఆర్‌బిఐకు ఎలా తాకట్టుపెట్టారో? ఎంత మందికి నిబంధనల పేరుతో పెన్షన్లు తొలగించారో చెప్పి ఉంటేబాగుండేదన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందనేది చిన్న పిల్లవాని అడిగినా చెబుతారన్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రాబోవు రోజుల్లో శాంతి యుత పాలన ఉంటుందని అభివృద్ది సంక్షేమం సమ పాళ్ళలో ఉంటుందని పరిశ్రమలు వస్తాయని వివరించారు.

## ఇది అసలైన ప్రజాతీర్పు...

తొట్టంబేడు, జూన్ 4 ప్రభాతవార్త



జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడి చంద్రన్న పాలనకు అంకురార్పణ చేయడంలో రాష్ట్ర ప్రజలు అసలైన అంతిమతీర్పు నిచ్చారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, టిడిపి తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలిమురళీనాయుడు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వెల్లడైన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టిడిపి జనసేన బిజెపి కూటమి ఘన విజయం సాధించడం పట్ల గాలిమురళీనాయుడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి విధ్వంసక పాలన కారణంగా విసి వేసారిన ప్రజలు జగన్ అండ్ కోకు కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా చేశారని ఎద్దేవా చేశారు. ఇది ప్రజా విజయమని ఈగెలుపును బలుపుగా భావించకుండా టిడిపి నాయకులు కార్యకర్తలు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి సారధ్యంలో అభివృద్దిని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు తామంతా సిద్దంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాక్షసపాలనకు చరమగీతం పాడారు..

రాక్షసపాలనకు చరమగీతం రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడారని తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు సరైన తీర్పునిచ్చారని జగన్ రాక్షసపాలనకు చరమగీతం పాడారని తెలిపారు. ఇకపై రాష్ట్రంలో సంక్షేమ పాలనతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉంటారన్నారు.

## చంద్రబాబునాయుడుకు అభినందనలు

శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కూటమి అత్యధిక విజయం సాధించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈనెల 9వ తేదీన అమరావతిలో ప్రమాణస్వీకారం చేయబోతున్న శుభసందర్భంగా తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడుకు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి. విజయకుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకు మునుపు చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు రాక్షసపాలనను అంతమొందించడానికి ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారన్నారు. అలాగే శ్రీకాళహస్తి నియోకజవర్గంలో కూడా బొజ్జలసుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించున్నామని వివరించారు. ఈసందర్భంగా చంద్రబాబునాయుడు విజయకుమార్‌ను అభినందించారు.

# తిరుపతి డివిజన్

## టిడిపి అధికారంలోకి రావాలని అంతర్వేదిలో దొడ్ల కరుణ ప్రత్యేకపూజ

తిరుపతిరూరల్, జూన్ 4 ప్రభాతవార్త:



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని....రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు....చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని అఖండ మెజార్టీతో గెలివాలని ఆకాంక్షిస్తూ....అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం తుమ్మలగుంటకు చెందిన సీనియర్ టిడిపి నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసారు. ఆంధ్ర రాష్ట్రంలో వైసిపి ఆరాచకపాలన, హత్యా రాజకీయాలు నశించాలని, రాష్ట్రప్రజలు చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేసినట్లు దొడ్ల కరుణాకర్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబునాయుడు నాయకత్వంతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని విజయవాడ కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ కార్యధర్శి నారా లోకేష్‌ను కలిసి, తీర్థప్రసాదాలు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేయనున్నట్లు దొడ్ల కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## వడమాలపేటలో టీడీపీ జయబేరి

వడమాలపేట, జూన్ 4 ప్రభాతవార్త:

వడమాలపేట మండలంలో టీడీపీ పూర్వ వైభవం సాధించింది. ఆవిర్భావం నుంచి వడమాలపేట మండలం పార్టీకి అండగా నిలిచింది. గాలి ముద్దుకృష్ణమనాయుడు వెన్నెనంటే నిలిచింది. అనివార్య కారణాల వల్ల ముద్దుకృష్ణమనాయుడు టీడీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో మండలంలో టీడీపీ గ్రాఫ్ పడిపోయింది. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధిస్తూ వస్తుంది. ముద్దుకృష్ణమనాయుడు తిరిగి టీడీపీలోకి వచ్చిన మండలంలో ఓటర్లు మాత్రం కాంగ్రెస్ వైపే నిలిచారు. మంత్రి రోజా రెండు పర్యాయాలు విజయం సాధించడానికి వడమాలపేట మండలంలో వచ్చిన మెజారిటీనే కారణం. ఈ ఎన్నికల్లో చరిత్రను తిరగరాస్తూ ఎన్నడూ లేని విధంగా గాలి భానుప్రకాష్ 6030 ఓట్ల ఆధిక్యం లభించింది. మండలంలో 24716 ఉండగా 21768 ఓట్లు పోలయ్యాయి. 31 పోలింగ్ బూత్‌లలో కేవలం రెండు బూత్‌లలో మాత్రమే వైసీపీకి స్వల్పంగా మెజారిటీ రావడం గమనార్హం. 31 బూత్‌లలో టీడీపీకి 29 బూత్‌లలో 6126 ఓట్లు మెజారిటీ రాగా వైసీపీకి కేవలం రెండు బూత్‌లలో కలిపి 96 ఓట్లు మెజారిటీ మాత్రమే వచ్చింది. మొత్తానికి టీడీపీకి మండల ఓటర్లు సంపూర్ణ మద్దతు భారీ మెజారిటీ ఇచ్చారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన గాలి భానుప్రకాష్ 3200 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. భానుప్రకాష్ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా సంబరాలు చేసుకున్నారు.

## రేణిగుంటలో ఎంజీ ఆధ్వర్యంలో సంబరాలు

రేణిగుంట, జూన్ 4 ప్రభాతవార్త:



సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేసినందుకు మంగళవారం రేణిగుంట పట్టణంలో తెలుగు యువత నాయకుడు ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకు న్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జలసుధీర్‌రెడ్డి అఖండ మెజారిటీతో గెలవడం శుభసూచకమని ఎంజీ రెడ్డి అన్నారు. ఎంజీ రెడ్డి కార్యాలయం వద్ద ఆయన అభిమానులు, మిత్ర బృందం, ఎంజీ యువసేన సభ్యులకు కేక్ కట్ చేసిపంచారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగల సత్తా బొజ్జల రెడ్డికి ఉందన్నారు. రేణిగుంట మండలంలోని అనేక ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కార్యక్రమంలో బుల్లెట్ రాజా, కిషోర్, షఫీ, పవన్, విశాల్, శివ, తేజ, మోహన్ తదితరులు పాల్గొన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించినందుకు రేణిగుంట టీడీపీ అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, తిరుపతి జిల్లా టీడీపీ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామినాయుడు, మాజీ టీడీపీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, రేణిగుంట మాజీ జడ్పీటీసీ లీలావతి, మాజీ వైస్ ఎంపీపీ సుజాత చౌదరి, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, టీడీపీ ముస్లిం మైనారిటీ నేతలు మునీర్ జీకే, నవాబు, అప్రోజ్, టీడీపీ సీనియర్ నేతలు పుష్పనాథం, కన్నన్‌రెడ్డి, కొరియర్ రవి, అడ్వకేట్ ఉదయకుమార్‌రెడ్డి, నెల్లూరు సుబ్రహ్మణ్యం, నగరి మునెయ్య, బుజ్జినాయుడు తదితరులు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## నగరి చరిత్రను తిరగరాసిన భానుప్రకాష్

– పట్టణ తెలుగుదేశం నాయకులు

నగరి, జూన్ 4 ప్రభాతవార్త:



నగరి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి గాలి భానుప్రకాష్ అత్యధిక మెజారిటీ సాధించినందుకు పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగి తేలారు. మొట్ట మొదటగా ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి 1116 కొబ్బరికాయలు అమ్మవారికి మొక్కుబడిగా కొట్టారు. నగరి పట్టణంలోనే కాక పరిసర గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరి చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున మెజారిటీ సాధించడం స్వయంకృషి పట్టుదల, కార్యదీక్ష, అని నాయకులు జేజేలు పలుకుతూ సంబరాలు చేసుకున్నారు. పరిసర గ్రామాల్లోని భాను యువసేన నాయకులు, కార్యకర్తలు ఓంశక్తి బైపాస్ రోడ్డులో టపాకాయలు పేల్చి సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్ ఖాదర్‌బాయ్, సురేష్‌నాయుడు, లోకేంద్రబాబు, జడ్పీటీసీ వెంకటరత్నం, ఎం.వి.శ్రీనివాసులు, సెంథిల్‌కుమార్, మహిళా నాయకులు ఆనం విజయలక్ష్మి, గౌరి రమేష్, సుజాత, కృష్ణవేణి, చంద్రయ్య, భరత్, కరగంతాపురం, అశోక్, మదన్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం, కుమార్, రాజా జీవరత్నం, కె.వి.సోము, కుప్పయ్య, కె.జె.గోపి, లోకయ్య నాయుడు, ఎల్.కె. నాయుడు, రాజీవ్‌నగర్ మణి, అనిల్‌కుమార్, వెంకటరత్నం, తిరుమల విక్కి తదితరులు పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో టీడీపీ సంబరాలు

కేవీబీ పురం, జూన్ 4 ప్రభాతవార్త:



సత్యవేడు కోనేటి ఆదిమూలం గెలుపొందడంతో మండల కేంద్రమైన కేవీబీ పురంలో మంగళవారం సాయిబాబా ఆలయంలో పూజలు చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జై తెలుగుదేశం జై చంద్రబాబునాయుడు జేజేలు పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అమరంబేడు పరందామరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు ఏ.శివరావు, తిరుపతి పార్లమెంట్ యూత్ కార్యదర్శి, మాజీ సర్పంచ్ కరపారెడ్డి, కందస్వామి, బాల, భారతి, చెంగారెడ్డి, ఢిల్లీరెడ్డి, కన్నయ్య యాదవ్, మురగారెడ్డి, మునికృష్ణ, ఎం.బాలాజీ, అభిమానులు పాల్గొని సంబరాలు చేసుకున్నారు.

## ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన మల్లికార్జున్‌రెడ్డి

కేవీబీ పురం, జూన్ 4 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ చైర్మన్‌గా మాజీ ప్రధానోపాధ్యాయులు త్రినేత్ర ఆస్పత్రి అధినేత ఆదవరం నాగురయ్యని, డైరెక్టర్‌గా పాలగిరి మల్లికార్జున్‌రెడ్డిలను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం నాయుడుపేటలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూడో అసోసియేషన్ సీఈవో గౌరవ అతిథి జొన్నలగడ్డ శైలజ చౌదరి పాల్గొన్నారు. బాలగిరి మల్లికార్జున్‌రెడ్డికి మండలంలోని నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువలతో పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, సత్యవేడు నియోజకవర్గం యువత అధ్యక్షులు లక్ష్మీపతిరాజు, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యం, ప్రొఫెషనల్ వింగ్ కన్వీనర్ కందస్వామి, యూనిట్ ఇన్‌చార్జి మునిశంకర్, సీనియర్ నాయకులు నంది కేశవులునాయుడు, సర్పంచ్ బాలాజీ, మండల ప్రొఫెషనల్ వింగ్ కన్వీనర్ ప్రవీణ్, నాగరాజురెడ్డి, వెంకటేష్, మునికృష్ణయ్య పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డిని సత్కరించి తొట్టంబేడు నాయకులు

.తొట్టంబేడు, జూన్ 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్‌ఏగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన బొజ్జలవెంకట సుధీర్‌రెడ్డిని తొట్టంబేడు జడ్పీటిసి అర్చనాదేవి, మాజీ సర్పంచ్ మునిరత్నంల ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డిని భారీపూల మాలతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది తన విజయం కాదని నియోజకవర్గ ప్రజలందరి విజయమని స్పష్టం చేశారు. గ్రామాల సుందరీకరణే లక్ష్యంగా తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ అభివృద్ధి చేస్తామన్నారు.

# నగరిలో 'భానో' దయం

**45004 ఓట్ల మెజార్టీతో గాలి భానుప్రకాశ్ విజయం**
**హ్యాట్రిక్ మిస్సయిన మంత్రి రోజా**



పుత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త : అసెంబ్లీ ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి భానుప్రకాశ్ తన ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంత్రి ఆర్.కె.రోజాపై భారీ మెజార్టీతో విజయం సాధించారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచి భాను ఆధిక్యత కనపరిచారు. మొత్తం 17 రౌండ్ల ఓట్ల లెక్కింపు జరగ్గా చివరి రౌండ్ వరకూ భాను ప్రతి రౌండ్‌లోనూ మెజార్టీ సాధించారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత 2009లో ఏర్పడిన నగరి నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేనంత మెజార్టీని భానుప్రకాశ్ సాధించారు. అలాగే పునర్విభజనకు ముందు వున్న నగరి నియోజకవర్గంలో కూడా ఎవరికీ ఈ స్థాయిలో మెజార్టీ దక్కలేదు. 2014, 2019 సంవత్సరాల్లో జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రస్తుత ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించాలనుకున్న రోజా ఘోర అపజయాన్ని చవి చూడాల్సి వచ్చింది. వడమాలపేట మండలానికి సంబంధించి మొదటి రౌండ్‌లో 2691 ఓట్ల మెజార్టీతో ప్రారంభించిన భానుప్రకాశ్ విజయ ప్రస్థానం చివరి వరకూ కొనసాగింది. గత ఎన్నికల్లో వడమాలపేట మండలంలో వైసిపికి సుమారు 3300 ఓట్లు మెజార్టీ రాగా ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి 5640 ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం. ఏ రౌండ్‌లోనూ టిడిపికి వైసిపి పోటీ ఇవ్వలేకపోయింది. 17 రౌండ్లు పూర్తయ్యేటప్పటికి భాను 45004 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నగరి నియోజకవర్గంలో మొత్తం 202574 ఓటర్లు వుండగా 86078 మంది పురుష ఓటర్లు, 90316 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 5గురు కలిపి 176399 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 87.08 ఓటింగ్ శాతం నమోదైంది.

# కుప్పం 'కింగ్'చంద్రబాబు నాయుడే

**- వైకాపా అభ్యర్థి భరత్‌పై 48343 ఓట్లతో ఎనిమిదో విక్టరీ**



కుప్పం, జూన్ 4 ప్రభాతవార్త : కుప్పం 'కింగ్ ' తానేనని తెలుగుదేశం పార్టీ అధినేత, కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరూపించు కున్నారు. వరుసగా ఎనిమిదోసారి కుప్పం అసెంబ్లీ స్థానం నుంచి ఆయన ఘన విజయం సాధించారు. కుప్పం అసెంబ్లీ స్థానం నుంచి ఈదఫా 48,343 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు మంగళవారం సాయంత్రం ప్రకటించారు. కుప్పం నియోజకవర్గంకు సంబంధించి మొత్తం పోలైన ఓట్లు 2,02920 ఓట్లను 18 రౌండ్లలో లెక్కించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, తొలి రౌండ్ నుంచే తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆధిపత్యం కొనసాగిస్తూ వచ్చారు. 18వ రౌండ్ ఫలితాలు ముగిసే సరికి చంద్రబాబు నాయుడుకు మొత్తం 1,20926 ఓట్లు రాగా భరత్‌కు 73586 ఓట్లు వచ్చాయి. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం 1579 కాగా అందులో చంద్రబాబునాయుడుకు 1003 ఓట్లు వచ్చాయి. భరత్‌కు 337 ఓట్లు మాత్రమే లభించాయి. దీంతో చంద్రబాబునాయుడు 48343ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. కుప్పం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మొత్తం 13మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో 11మందికి డిపాజిట్లు కూడా దక్కలేదు. మూడో స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆవులగోపి నిలువగా నాలుగోస్థానంలో నోటా నిలవడం విశేషం. గత 2019 ఎన్నికల్లో చంద్రబాబుకు 30722ఓట్ల మెజార్టీ రాగా ఈసారి మెజార్టీ దాదాపు 18వేలు పెరిగింది. కుప్పంలో చంద్రబాబుకు మెజార్టీ పెరగడం, మరలా ముఖ్యమంత్రిగా ఈనెల 9న చంద్రబాబు బాధ్యతలు చేపట్టనుండడంతో కుప్పం దేశం శ్రేణులు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

## మూడోసారి కురుగొండ్లను వరించిన విజయం



వెంకటగిరి టౌన్, జూన్ 4 ప్రభాతవార్త: వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ 15454 ఓట్లతో విజయం సాధించారు. వైఎస్ఆర్‌సిపి అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పై ఆయన విజయం సాధించారు. టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణకు 102716 ఓట్లు రాగా, వైసిపి అభ్యర్థి రాంకుమార్ రెడ్డికి 87262 ఓట్లు వచ్చాయి. టిడిపి అభ్యర్థి రామకృష్ణకు 22 రౌండ్లలో మెజారిటీ సాధిస్తూ వచ్చారు. 2009, 2014 సంవత్సరంలో ఆయన తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. 2019వ సంవత్సరంలో ఆయన ఓటమి చూశారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో మూడో సారి కురుగొండ్ల ఘన విజయం సాధించారు. కురుగొండ్ల రామకృష్ణ డక్కిలి మండలం కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన సామాన్య రైతు కుటుంబాని చెందిన నాయకులు, వ్యాపారవేత్తగా ఆయన ఎదిగి రాజకీయాల్లోకి వచ్చారు. వెంకటగిరి నియోజకవర్గంలో మూడోసారి ఎమ్మెల్యేగా ఇంతవరకు ఎవరు గెలవలేదు. రామకృష్ణ మూడోసారి విజయం సాధించి నియోజకవర్గంలో గుర్తింపు పొందారు.

## పలమనేరులో అమరుడి ఘన విజయం

**-20122 ఓట్ల మెజారిటీతో పలమనేరులో ఎగిరిన టిడిపి జెండా**



పలమనేరు,జూన్ 4,ప్రభాతవార్త: పలమనేరులో టిడిపి అభ్యర్థి మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఘనవిజయం సాధించారు.20122 ఓట్ల మెజారిటీతో వైకాపా అభ్యర్థి వెంకటేగౌడాపై టిడిపి అభ్యర్థి అమరనాథరెడ్డి ఘనవిజయం సాధించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో టిడిపి అభ్యర్థి ఘనవిజయం సాధించారు.చిత్తూరు ఎస్వీసెట్ కళాశాలలో ఉదయం ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుండి ఆఖరి రౌండ్ వరకు వైకాపా అభ్యర్థికి మెజారిటీ కానరాలేదు.ఓట్ల లెక్కింపులో 14 టేబులు ఏర్పాటు చేసి 21 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొదటి రౌండ్‌లో టిడిపి అభ్యర్థి అమరనాథరెడ్డికి 6420 ఓట్లు రాగా వైకాపా అభ్యర్థి డా.వెంకటేగౌడాకి 4462 ఓట్లు రావడం జరిగింది.మొదటి రౌండ్ ప్రారంభం నుండి ఆఖరి రౌండు వరకు టిడిపి అభ్యర్థి అమరనాథరెడ్డి ఆధిక్యత కొనసాగింది.ఇందులో టిడిపి అభ్యర్థి అమరనాథరెడ్డికి 123232 ఓట్లు రాగా వైకాపా అభ్యర్థి వెంకటేగౌడాకి 103110 ఓట్లు రావడం జరిగింది.టిడిపి అభ్యర్థి అమరనాథరెడ్డి 20122 ఓట్ల మెజారిటీలో ఘన విజయం సాధిచారు.

## భారీ మెజార్టీ గెలుపొందిన పాశం సునీల్



గూడూరు, జూన్ 4 ప్రభాతవార్త: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గంలో నుండి తెలుగుదేశం పార్టీ తరపున పాశం సునీల్ కుమార్ పోటీ చేయడం వైఎస్ఆర్‌సిపి తరపున మేరుగ మురళీధర్ పోటీ నిలిచారు. అయితే తెలుగుదేశం పార్టీకి పోలైన ఓట్లు 102675 వైసిపికి వచ్చిన ఓట్లు 81483 రావడం జరిగింది అయితే 22469 మెజారిటీతో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా పాశం సునీల్ కుమార్ గెలుపొందారు. పోస్టల్ బ్యాలెట్‌లో రిజెక్ట్ అయిన 372 సునీల్ కుమార్ గతంలో 2014 వైసిపి తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలవడం మరల 2019లో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేయగా 63610 ఓట్లు రావడం 108893 వైసిపికి రావడం జరిగింది ఓటమి చెందిన అధైర్య పడకుండా దైర్యంగా ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఐదు సంవత్సరాలు సేవలందించడం జరిగింది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రజలు ఇప్పుడు భారీ మెజారిటీతో గెలిపించారు.

## ఎట్టకేలకు పూతలపట్టులో 'దేశం' బోణీ



కాణిపాకం, జూన్ 4 ప్రభాతవార్త: నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన పూతలపట్టు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గంలో మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎట్టకేలకు టీడీపీ బోణీ చేసింది. నియోజకవర్గంలో హోరాహోరీగా సాగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ కె.మురళీ మోహన్ తమ సమీప వైకాపా అభ్యర్థి డాక్టర్ ఎం.సునీల్ కుమార్‌పై 15,634 ఓట్లు మెజారిటీతో ఘన విజయం సాధించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పూతలపట్టు, బంగారు పాళ్యం, యాదమరి, తవణంపల్లి, ఐరాల మండలాలుగా వున్న పూతలపట్టు ఎస్సీ నియోజకవర్గంలో 2008 సంవత్సరం నుండి ఇప్పటి వరకు మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ మూడు ఎన్నికల్లో ఒక్కసారి కాంగ్రెస్ పార్టీవిజయం సాధించగా మరో రెండు సార్లు జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేయాలని వైకాపా తమ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌ను, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్టు డాక్టర్ మురళీమోహన్‌లను పోటీలోకి దింపాయి. ఎట్టకేలకు మంగళవారం వెలువడిన ఫలితాల్లో అందరి అంచనాలను తారుమారు చేస్తూ టీడీపీ అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ 15,634 ఓట్లు మెజారిటీలో విజయాన్ని సొంతం చేసుకుని నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగుర వేశారు. ఈమేరకు టీడీపీ అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్‌కు 1,02,137 ఓట్లు రాగా, సమీప వైకాపా అభ్యర్థి డాక్టర్ ఎం.సునీల్‌కుమార్‌కు 86,503 ఓట్లు వచ్చాయి. దీనితో మురళీమోహన్ 15,634 ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు.

## చంద్రబాబు డిక్లరేషన్‌ఫామ్ అందుకున్న ఎమ్మెల్సీ



కుప్పం, జూన్ 4 ప్రభాతవార్త : కుప్పం అసెంబ్లీ (175) స్థానం నుంచి తెదేపా అధినేత, కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 48343 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. చిత్తూరు ఎస్వీసెట్‌లో కుప్పం రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసులు నుంచి చంద్రబాబునాయుడు ఎన్నికల గెలుపు డిక్లరేషన్ ఫామ్‌ను చంద్రబాబు నాయుడు తరపున ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆర్వో నుంచి అందుకున్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, రాష్ట్ర నేత డా॥ వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, హేమాంబరగౌడు, టిడిపి ఆఫీస్ మేనేజర్ చలపతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు ఎమ్మెల్యేగా గురజాల ఎన్నిక



చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన గురజాల జగన్మోహన్‌నాయుడు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో చిత్తూరు నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గురజాల జగన్మోహన్‌నాయుడు వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డిపై 14 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు 85,734 ఓట్లు సాధించగా వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి 72,399 ఓట్లు దక్కించుకున్నారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుండి ప్రతి రౌండ్‌లోను తెలుగుదేశం అభ్యర్థి గురజాలకు మెజార్టీ ఓట్లు వస్తుండటంతో వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి చతికిలపడాల్సి వచ్చింది. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడుకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు డిక్లరేషన్ అందజేశారు. రాజకీయాల్లో ఏ మాత్రం అనుభవం లేకపోయినప్పటికీ చిత్తూరు ఎన్నికల్లో కాకలు తీరిన మాజీ ఎమ్మెల్యేలతో చర్చించి తెలుగుదేశం విజయానికి వ్యూహం రచించి పక్కాగా అమలు చేయడంలో జగన్మోహన్‌నాయుడు విజయం సాధించారు.

## శ్రీకాళహస్తిలో తెలుగుదేశం జెండా రెప రెపలు



శ్రీకాళహస్తి,జూన్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగు దేశం అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి విజయం సాధించారు.గత నెల 13న జరిగిన పోలింగ్‌లో ఓటు చేసిన ఓట్లను మంగళవారం లెక్కించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళహస్తి మండ లం, అర్బన్, రేణిగుంట, ఏర్పేడు తొట్ట ంబేడు మండలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,48,536 మంది కాగా ఇందులో మహిళలు 1,28,549, పురుషులు 1,19,973 మంది ఉన్నారు. గత నెల 13న జరిగిన పోలింగ్‌లో మహిళలు 1,05,930 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా పురుషులు 1,00,982 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ప్రతి రౌండ్‌లో దేశానికి ఆధిక్యమే:**

శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి మండలంలో మన్నవరం నుంచి ఊరందూరు వరకు 1 నుంచి 45 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి దీనిని మూడు రౌండ్లుగా విభజించారు. ఇక్కడ లెక్కింపు జరపగా 924 ఓట్లు తెలుగుదేశం పార్టీకి ఆధిక్యం వచ్చింది.పోలింగ్ స్టేషన్ 46నుంచి 113 వరకు శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఉంది. ఇక్కడ ఓట్లు లెక్కించగా సుమారు 13వేల ఓట్ల మెజారిటి వచ్చినట్లు గణాంకాలు తెలిపాయి.ఇక ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు ఏర్పేడు,రేణిగుంట రూరల్ అర్బన్ కలిపి సుమారు 18వేల మెజారిటిని తెలుగుదేశం దక్కించుకున్నారు. ఇక తొట్టంబేడు మండలంలో 5368 ఓట్లు మెజారిటి సాధించింది. లెక్కింపు ప్రారంభం నుంచి చివరి వరకు తెలుగుదేశం అధిక్యతను సాధిస్తూనే వచ్చింది.గెలిచిన తెలుగుదేశం అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి 1,19,554 ఓట్లు రాగా వైకాపా అభ్యర్థి బియ్యపు మధు సూధనరెడ్డికి 77,575 ఓట్లు వచ్చినట్లు ప్రకటించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన లెక్కింపుకు ఇద్దరు అభ్యర్థులు సుధీర్‌రెడ్డి, బియ్యపు మధుసూధనరెడ్డిలు హాజరయ్యారు. వైకాపా అభ్యర్థి మధ్యాహ్నం నుంచి లెక్కింపుకేంద్రం నుంచి వెళ్ళగా సుధీర్‌రెడ్డి పార్టీ ఆదేశాల మేరకు డిక్లేరేషన్ తీసుకొని బయటకు వచ్చారు.

## రెండవసారి సత్యవేడు ఎమ్మెల్యేగా ఆదిమూలం విజయం



నారాయణవనం, జూన్ 4 ప్రభాతవార్త : సత్యవేడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా రెండవ సారి ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం ప్రత్యర్థి పార్టీ వైకాపా అభ్యర్థి నూకతోటి రాజేష్‌పై సుమారు 3739 ఓట్ల తేడాతో విజయం సాధించారు. హోరా హోరీగా సాగిన కౌటింగ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా వున్న కోనేటి ఆదిమూలం గెలుపొందడంతో ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. సత్యవేడు స్థానం నుంచి 2014లో వైకాపా తరపున పోటీ చేసి స్వల్ప ఆధిక్యంలో అప్పట్లో ఓడిపోయారు. అనంతరం 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ వైకాపా తరపున పోటీ చేసి సుమారు 46వేల పై చిలుకు ఓట్లతో ప్రత్యర్థి టిడిపి అభ్యర్థి జెడి రాజశేఖర్‌పై గెలుపొందారు. మూడు నెలల క్రితం జరిగిన ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో వైకాపా పార్టీ తరపున సీటు ఇవ్వకుండా అన్యాయం జరగడంతో వైకాపా పార్టీని వీడి టిడిపిలో చేరారు. మంగళవారం జరిగిన కౌటింగ్‌లో కోనేటి ఆదిమూలంకు 85471 ఓట్లు, వైకాపా అభ్యర్థి నూకటితోటి రాజేష్‌కి 81732 ఓట్ల వచ్చింది. దీంతో కోనేటి ఆదిమూలం సుమారు 3739 ఓట్ల తేడాతో గెలుపొందారు. సత్యవేడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ తరపు పోటీ చేసిన బాలగురవం బాబుకి 5444 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ టిడిపికి 845, వైకాపా 421, కాంగ్రెస్‌కి 20 ఓట్లు పడింది. సత్యవేడు టిడిపి అభ్యర్థిగా కోనేటి ఆదిమూలం రెంవవసారి గెలుపొందడంతో అన్ని గ్రామాల్లోను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

## భారీ మెజారిటీతో పులివర్తి నాని విజయం

**-25 ఏళ్ళ చరిత్రపై పులివర్తి నాని చెరగని ముద్ర**



చంద్రగిరి, జూన్ 4 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని భారీ మెజారిటీతో అద్భుత విజయం సాధించారు. మంగళవారం విడుదలైన 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో చంద్రగిరి ఎంఎల్ఏగా టిడిపి అభ్యర్థి పులివర్తి వెంకటమణిప్రసాద్ అలియాస్ పులివర్తి నాని తన సమీప వైసిపి ప్రత్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిపై 43,396 ఓట్ల భారీ మెజార్టీతో అఖండ విజయం సాధించారు. పులివర్తి కుటుంబం 5ఏళ్ళ సుధీర్ఘ శ్రమకు మంగళవారం ప్రకటించిన ఫలితాలతో ఔరా అనిపించారు. 5 ఏళ్ళ పాటు నిత్యం ప్రజల మధ్యన గడపడం, వారి కష్టాలను గమనించి అక్కున చేర్చుకోవడం వంటి చర్యలతో ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. ఇప్పటి వరకు చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయి రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకున్న టిడిపి పాలనలో చంద్రగిరి ఎంఎల్ఏ స్థానం దక్కించుకోవడం అరుదైన రికార్డుగా నిలిచింది. ఎన్నికల ఫలితాల ప్రకటన ప్రారంభం నుండి ఆద్యంతం చంద్రగిరి సహా రాష్ట్ర వ్యాప్తంగా ఫలితాల హోరు జోరు తగ్గకపోవడంతో టిడిపి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేళుళ్ళతో అంబర్నాంటేలా సంబరాలు జరుపుకున్నారు.

## సూళ్లూరుపేట టిడిపికి తొలి మహిళా ఎమ్మెల్యే

**- నెల'వల'కు చిక్కిన విజయం**



తడ, జూన్ 4 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయం సాధించారు. నెలవల కుటుంబంలో ఇది వరుసగా మరో విజయం కావడం విశేషం. సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారి ఒక మహిళ ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మైలారి లక్ష్మీకాంతమ్మ, విన్నమాల సరస్వతి, ప్రజారాజ్యం పార్టీ నుంచి గరిక ఈశ్వరమ్మ వంటి మహిళలు పోటీపడినప్పటికీ విజయం సాధించలేకపోయారు. మంగళవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో నెలవల విజయశ్రీకి విజయం దక్కింది. రెండుసార్లు నెలవల సుబ్రహ్మణ్యం ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం ఆయన కుమార్తె విజయశ్రీ 29 వేల ఓట్లకు పైగా భారీ మెజార్టీతో గెలుపొందారు. తన విజయంలో కీలకపాత్ర పోషించిన టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలకు, ఆదరించిన అన్ని మండలాల, రెండు మున్సిపాలిటీల ఓటర్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## టిడిపి అభ్యర్థి పాశిం ఘన విజయం

**గూడూరు నియోజకవర్గ ప్రజల తీర్పు**



గుడూరు, జూన్ 4 ప్రభాతవార్త : కురుక్షత్ర యుద్ధంనీ తలపించిన సార్వత్రిక ఎన్నికల్లో లోకల్ అభ్యర్థి అయిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ ఘన విజయం సాధించారు. తన ప్రత్యర్థి అయిన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌పై 22469 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. గూడూరు ప్రజలు లోకల్ అభ్యర్థికే పట్టం కట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందు ఉండేవారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేసి, ఎప్పటికప్పుడు ప్రభుత్వా లోటు పాటులను ఎండ గడుతు, ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారు. దీంతో నియోజకవర్గం ప్రజలు భారీ మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వారి పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. సునీల్ కుమార్ నివాసం వద్ద ఆయన సతీమణి సంధ్యారాణి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

## కుప్పంలో తెదేపా శ్రేణుల భారీ సంబరాలు

**- పసుపు జెండాలతో యువత కేరింతలు**



కుప్పం, జూన్ 4 ప్రభాతవార్త : అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడం, మరలా సిఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనుం డడంతో కుప్పంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీగా సంబరాలు జరుపుకున్నారు. ఉదయం ఎన్నికల కౌంటింగ్ మొదలై తెదేపా ఆధిపత్యం కన్పించడంతో స్థానిక తెదేపా కార్యాలయం వద్దకు భారీ ఎత్తున నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. జై బాబు.. జైజై బాబు అంటూ నినాదాలు చేశారు. యువత అయితే భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ జెండాలు చేతపట్టుకుని టు వీలర్లతో కేరింతలు కొడుతూ నినాదాలు చేస్తూ పట్టణమంతా తిరిగారు. స్థానిక తెదేపా కార్యాలయం వద్ద, బస్టాండు వద్ద భారీ ఎత్తున కార్యకర్తలు, నేతలు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని వివిధ కూడళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో సైతం పార్టీ శ్రేణులు భారీగా టపాకాయలు కాల్చారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేతలు గోపినాథ్, శాంతారాం, కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్,కౌన్సిలర్లు జిమ్‌దాము, సురేష్, నేతలు సురేష్, సుధీర్, ఉమాపతి, కిరణ్, నాగేంద్ర, నరేష్, మహిళా నేత అనసూయ, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలు చంద్రబాబు సేవల్ని కోరుకున్నారు: ఎస్‌సివి



శ్రీకాళహస్తి,జూన్ 4 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్ర ప్రజలు విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు సేవల్ని కోరుకున్నారని మాజీ శాసన సభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. మంగళవారం శాసనసభ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే రాష్ట్ర ప్రజలు అభివృద్దికి పట్టం కట్టారని చెప్పాల్సి వస్తుందని ఆయన వివరించారు. విభజన ఆంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ది పథంలో నడుపుతున్న నారాచంద్రబాబునాయుడును ఓడించటానికి ప్రతిపక్ష నాయకుడుగా జగన్మోహన్‌రెడ్డి వాడిన 'ఒక్క చాన్సు' మాయలో పడి అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసారన్నారు. అప్పులు తెచ్చి పప్పు బెల్లాల్లా పంచిపెట్టి మళ్ళీ మరో అవకాశం, మీ బిడ్డ మేలుచేసి ఉంటేనే ఓటు వేయండని పిలుపు నిచ్చారని స్పందించిన ప్రజలు సైలెంట్‌గా తమ తీర్పును ఓటు ద్వారా ఇచ్చారన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలో ఉన్న నాయకులు ఎన్నో గిమ్మికులు చేసారని అంతేకాక ఓటర్లను ప్రలోభాలతో ముంచెత్తినా ఓటర్లు నిశ్చింతగా తాము కోరుకున్న 'మార్పు'కు పెద్ద పీట వేసారన్నారు. శ్రీకాళహస్తి ప్రజలు తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారని యువకుడైన శాసనసభ్యుడుగా గెలిచిన సుధీర్‌రెడ్డి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపి తెలుగుదేశం పార్టీకి మళ్ళీపూర్వ వైభవం తీసుకువస్తారన్నారు.

# తిరుపతి ప్రజల నమ్మకం జనసేనపైనే!

**-"ఆరణి'గెలుపు అంతా కలిసొచ్చిన అదృష్టం**



తిరుపతి,జూన్ 4ప్రభాతవార్త: రాష్ట్రంలోనే కొంత ప్రత్యేకత,ప్రాధాన్యత ఉన్న తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా జనసేనపార్టీ బలపరిచిన ఆరణి శ్రీనివాసులు విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డిపై 60,255 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు మొదలైన తొలిరౌండ్ నుండి వైసిపి అభ్యర్థికంటే కొంతమేర ఆధిక్యత సాధిస్తూ వచ్చారు. చివరకు పోస్టల్ బ్యాలట్‌లో కూడా 2వేలు పైచిలుకు ఓట్లు ఆరణికి లభించాయి. తిరుపతిలో ఆయన పోటీచేసి గెలవడంతో జనసేన పార్టీ నేతలు, కూటమిలోని టిడిపి, బిజెపి నేతలు సంబరాలు చేసుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్యేగా 2019లో వైసిపి నుండి పోటీచేసి గెలిచిన ఆయన అక్కడ తాజా ఎన్నికల్లో టిక్కెట్ రాకపోవడంతో వైసిపిని వీడి జనసేనలో చేరారు. ఆయన తిరుపతి నుండి పోటీచేయాలని జనసేనాని పవన్ ఆదేశించడంతో ఈ స్థానంపై దృష్టి పెట్టారు. ఎన్నికలకు నెలన్నరరోజుల ముందు ఈ టిక్కెట్ ఖరారుచేయడంతో ఆయన పోటీని తొలినుండి వ్యతిరేకించిన సొంత జనసేనపార్టీలోని నాయకులతో బాటు కూటమిలోని టిడిపి శ్రేణులు కూడా పూర్తిగా మొఖం చాటేశాయి. తిరుపతికి బయటి నుండి వచ్చిన వ్యక్తి పోటీచేయడం ఏంటనే ప్రశ్నలు కూటమి పార్టీ నేతలే వ్యక్తం చేశారు. వీటన్నిటీని తనకు అనుకూలంగా మలచుకోవడంలో ఆరణి శ్రీనివాసులు అధినేత సూచనలతో ముందుకు నడిచారు. తిరుపతి అసెంబ్లీకి సంబంధించి 3,02,503మంది ఓటర్లు ఉండగా మే 13న జరిగిన పోలింగ్‌లో 1,91,557మంది ఓటర్లు తమ ఓటు వేశారు. 60,255 ఓట్ల ఆధిక్యతతో ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డిపై గెలిచారు. మొత్తం 20 రౌండ్ల ఓట్ల లెక్కింపుల్లో తొలిరౌండ్‌నుండి ఆధిక్యత దిశగా కదిలారు. తిరుపతి నియోజకవర్గంలో తొలిరౌండ్‌లో జనసేన ఆరణి శ్రీనివాసులుకు 5,428ఓట్లు రాగా వైసిపి అభినయ్‌కు 2,740ఓట్లు లభించాయి. 2,688ఓట్లు ఆధిక్యతతో ముందుకు వెళ్ళారు. 2వ రౌండ్‌లో జనసేనకు 11,557 ఓట్లు రాగా వైసిపికి 6,284ఓట్లు లభించాయి. 3వరౌండ్‌లో జనసేనకు 6,011ఓట్లు, వైసిపికి 2,517ఓట్లు,4వరౌండ్‌లో 4,664ఓట్లు జనసేనకు, 2,945ఓట్లు వైసిపికి పడ్డాయి. 5వరౌండ్‌నుండి పూర్తిస్థాయిలో విజయంవైపు జనసేన అభ్యర్థి దూసుకెళ్ళాడు. 9వరౌండ్ వచ్చేసరికి 55,876ఓట్లు జనసేన, 17,749ఓట్లు వైసిపికి దక్కాయి. 29,759ఓట్ల ఆధిక్యత కనిపించింది. ఇలా ప్రతిరౌండ్‌లోనూ జనసేన ఆధిక్యత చాటారు. చివరగా 17వరౌండ్‌లో జనసేనకు 1,07,631ఓట్లు రాగా, వైసిపికి 52,236ఓట్లు వచ్చాయి. 55,395ఓట్లు తేడా కనిపించింది. చివరి 20వ రౌండ్‌లో జనసేనకు 1,21,205ఓట్లు రాగా వైసిపికి 60,950ఓట్లుతో నిలిచారు. 60,255 ఓట్ల ఆధిక్యతలో ఆరణి విజయం సాధించారు. ఓటర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని తిరుపతిని మరింత ఆద్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.